

మగోడు

డిప్రెషన్‌లో పెళ్లికాని ప్రసాద్‌లు

- అమ్మాయిల ఆలోచనల్లో మార్పులతో తిప్పలు
- సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉండాలంటోన్న యువతులు
- ఐదు అంకెల జీతం ఉంటేనే మూడుముళ్లకు సిద్ధం
- స్వయంవరంలో సంప్రదాయ కులవృత్తుల యువత ఓటమి

సండే స్పెషల్

● మంగళగిరికి చెందిన ఓ యువకుడు సంప్రదాయంగా వచ్చిన వృత్తిని స్వీకరించాడు. అతడు నెలకు రూ.25 వేలు సంపాదిస్తున్నాడు. పదేళ్లుగా సంబంధాలు చూస్తున్నా పెళ్లిచూపులకు కూడా అతడు నోచుకోవడంలేదు. అతడు చేసే వృత్తి గురించి చెప్పగానే ఉద్యోగం లేదా అంటూ అవతలి వైపు నుంచి పెళ్లి ప్రస్తావన ఆగిపోతోంది.

● తెనాలికి చెందిన ఓ యువకుడు బంగారపు పని చేస్తూ నెలకు 70 వేల వరకు సంపాదిస్తాడు. ఇల్లు ఉంది. అయినా పెళ్లి కుదరడం లేదు. బంగారపు పనిచేసుకునే వారికి ఇవ్వం అని అమ్మాయి తరపు వారు తెగేసి చెబుతున్నారు.

● ఓ యువకుడు కార్పెంటర్ పని చేస్తూ నెలకు రూ. 40 వేల నుంచి 50 వేలు సంపాదిస్తున్నాడు. కానీ అతడికి 30 దాటినా పెళ్లి కల నెరవేరలేదు. అతడు చేసే పని చెప్పగానే సంబంధాలు వెనక్కి వెళ్లిపోతున్నాయి.

● డిగ్రీ పూర్తి చేసిన ఓ యువకుడు ఓ కంపెనీలో రూ.20 వేల జీతానికి ఉద్యోగం చేస్తున్నాడు. గత ఐదేళ్లుగా రెండు డజన్లకు పైగా సంబంధాలు వచ్చినా అతడికి వచ్చే జీతం చూసి తిరుగుటపాలో వెళ్లిపోతున్నాయి.

పెళ్లి.. పురుషుడికి పగటి కలగా మారుతోంది. అబ్బాయిలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉంటేనే అమ్మాయిలు పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. ఐదు అంకెల జీతం అందుకున్న వారితోనే మూడుముళ్లు వేయించుకుంటున్నారు. కొంతమంది అబ్బాయిలకు పెళ్లి చూపులు.. ఎదురు చూపులుగా మారుతున్నాయి. సంప్రదాయ కులవృత్తులు చేసుకునే వారు, వ్యవసాయం, ఇతర పనులపై ఆధారపడే వారు, చిరు జీత గాళ్లు, కూలి పనులతో జీవనం చేసుకునే యువకులు వివాహ బంధానికి నోచుకోవడం లేదు. తల్లిదండ్రులకు అండగా గ్రామాల్లో, చిన్న చిన్న పట్టణాల్లో ఉంటూ ఏదో ఒక పని చేసుకునే వారు కూడా మూడు ముళ్ల బంధాన్ని మరిచి పోవాల్సి వస్తోంది. దీంతో పెళ్లీడుకు వచ్చిన మగపిల్లలు అనేక మంది డిప్రెషన్‌కు గురవుతున్న సందర్భాలు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయి.

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఇలా ఒక సంబంధం విషయంలో అయితే పర్వాలేదు.. డజన్ల కొద్దీ సంబంధాలదీ ఇదే పరిస్థితి. సమాజంలో పురుష, స్త్రీ నిష్పత్తిలో వ్యత్యాసాలు రావడంతో అది పెళ్లిళ్లపై పడింది. దీంతో వివాహానికి సంబంధించి గతంలో ప్రాధాన్యాలు అబ్బాయిలకు ఉండగా ఇప్పుడు ఆ అవకాశం అమ్మాయిలు చేజిక్కించుకున్నారు. సంప్రదాయ వృత్తులైన వ్యవసాయం, వడ్రంగం, కుమ్మరి, కమ్మరి, మంగలి, పౌరోహిత్యం తదితర వృత్తులు చేసుకునే యువకులు పెళ్లి పగటి కలలా మారింది. బేల్దారి, టైలరింగ్, ఇతర చిన్న చిన్న పనులు చేసుకుంటూనో.. స్థానికంగా చిరు జీతాలతో ఉద్యోగం చేసుకుంటూనో.. గ్రామాల్లో ఉంటూ వ్యవసాయంపై ఆధారపడే వారు.. కూలి పనులు చేసుకునే వారికి కూడా పెళ్లి సంబంధాలు రావడం లేదు. యుక్త వయసుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ పెళ్లంటే ఎంతో ఆశగా మారింది.





● మూడు పదులు దాటినా..

సహజంగా జీవితంలో స్థిరపడ్డాక పెళ్లికి అబ్బాయిలు సిద్ధపడతారు. అయితే గత కొన్నేళ్లుగా ఇలాంటి వారికి సంబంధాలు కుదరడం కష్టంగా మారింది. మూడు పదులు దాటినా పెళ్లి కాని పరిస్థితి మగవాళ్లకు ఎదురవుతోంది. కుల, చేతి వృత్తులపై ఆధారపడిన యువకుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వారికి సంబంధాలు చూడడం, వెదకడమే కష్టంగా మారిపోయింది. వారి పెళ్లి ఊసెత్తగానే అయినవాళ్లు కూడా ముఖం చాటేస్తున్నారు. దూరపు బంధువులు ముఖం మీదే కాదని చెప్పేస్తున్నారు. సంప్రదాయ వృత్తుల్లో ఉండేవారిపై ఆడపిల్లల కుటుంబాల్లో ఆసక్తి తగ్గిపోవడంతో పెళ్లిళ్ల మధ్యవర్తులు కూడా పక్కకు తప్పుకుంటున్నారు.

వాళ్లు కనీసం అబ్బాయి ఫొటో, బయోడేటా కూడా తీసుకోవడానికి సుముఖంగా ఉండడం లేదు. ప్రభుత్వ ఉద్యోగులు, సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్, వ్యాపార ప్రముఖులు అయితేనో, రూ.కోట్లలో ఆస్తులు ఉంటేనో.. మధ్యవర్తులు సంబంధాలు చూస్తున్నారు.

● ఆడపిల్లల కుటుంబాల్లో విపరీత ధోరణులు

మారిన పరిస్థితుల రీత్యా పెళ్లి కావాల్సిన ఆడపిల్లలకు డిమాండు పెరిగింది. దీంతో ఆడపిల్లల కుటుంబాల ఆలోచనా ధోరణిలో విపరీత మార్పులు కనిపిస్తున్నాయి. సాదా, సీదా సంబంధాలను వారు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోవడం లేదు. ఆడపిల్లలు విద్యావంతులు కావడంతో వారి ఆలోచనల్లో కూడా మార్పు వచ్చింది. గతంలోలా కాకుండా తమ అభిరుచులకు తగినవారైతేనే సంబంధానికి ఓకే చెబుతున్నారు. ఆర్థికంగా మెరుగైన, సుభిక్షమైన జీవితాన్ని కోరుకుంటూ అందుకనుగుణంగా పెళ్లి పీటలు ఎక్కుతున్నారు. దీంతో సాదా, సీదా ఉద్యోగాలు చేసే వారికి, సంప్రదాయ, కుల వృత్తులను నమ్ముకున్నవారికి పెళ్లిళ్లు గగనమైపోయాయి.

కన్వర్షన్.. కనికట్టు

- పుట్టగొడుగుల్లా అనధికార లేఅవుట్లు
- అధికారుల ఒత్తిడి.. నిబంధనలకు తిలోదకాలు

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రోజు రోజుకు అనధికార లేఅవుట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. వేటపాలెం మండలం అక్కయ్యపాలెం, కొత్తపేట, రామాపురం, చల్లారెడ్డి పాలెం, పాపాయిపాలెం, కఠారిపాలెం ప్రాంతాల్లో పంట భూములను మెరక చేసి విక్రయిస్తున్నారు. అధికారులు కంటి తుడుపుగా కన్వర్షన్ చార్జీలు కట్టిస్తున్నారే కానీ చర్యలు తీసుకోవడంలేదు. అధికారులపై ఒత్తిడి లేకుంటే ఆయా లేఅవుట్లపై కన్నెత్తి కూడా చూడటం లేదు.కన్వర్షన్ చార్జీలతో మమ అనిపించి తదుపరి నిబంధనలకు నిర్మాణదారులు తిలోద కాలిస్తున్నారు. లే అవుట్ అనుమతికి కన్వర్షన్ కడితే సరిపోదు. సామాజిక, భవిష్యత్తు అవస రాలకు, ఖాళీ ఉంచాలి. మౌలిక వసతులకు ఏర్పాట్లు కల్పించాలి. ఆ తర్వాత పంచాయతి నుంచి అనుమతి పొంది మాత్రమే విక్రయాలు జరపాలి. అప్పుడే కొనుగోలుదారుడికి బ్యాంకు నుంచి రుణ సాయం వస్తుంది. కానీ ఇక్కడ వీటికి భిన్నంగా వ్యవహారాలు సాగుతున్నాయి. వాస్తవానికి అక్రమార్కులు చెల్లించే కన్వర్షన్ చార్జీలకు, రికార్డుల్లో చూపించే ధరలకు పొంతన ఉండటం లేదు. నియోజక వర్గంలో చాలా వరకు అక్రమ లేఅవుట్లు ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదు.



ఎక్స్‌కవేటర్‌తో అంతర్గత రహదారులు ఏర్పాట్లు



వేటపాలెం మండల పరిధిలో తాజాగా ఛలానా చెల్లించి లే అవుట్ నిర్మాణం

ఏ లేఅవుట్‌కూ అనుమతి లేదు

మండల పరిధిలో సుమారు 80 లే అవుట్లు ఉన్నట్లు సమాచారం. అయితే వాటిల్లో ఏ లేఅవుట్‌కు పంచాయతి అనుమతులు ఇవ్వలేదు. అనధికార లే అవుట్లతో కొనుగోలుదారులకు తీవ్ర నష్టం. వీటిపై నిశితంగా పరిశీలన చేసుకోవాలి. ఉన్నతాధికారుల ఆదేశాలతో అక్రమంగా విక్రయా లు జరిపితే చర్యలు తీసుకుంటాం.

-రాజేష్‌బాబు, ఎంపీడీవో వేటపాలెం

ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దాలి

- ప్లాస్టిక్ వ్యతిరేక ర్యాలీలో కలెక్టర్ వెంకటమురళి పిలుపు
- పర్యావరణాన్ని కాపాడే బాధ్యత ప్రజలదే : ఎమ్మెల్యే వేగేశన



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ వెంకటమురళి, నాయకులు, విద్యార్థులు, పారిశుధ్య సిబ్బంది

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహితంగా జిల్లాను తీర్చిదిద్దాలని కలెక్టర్ జె.వెంకటమురళి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాన్ని వివరిస్తూ శనివారం బాపట్లలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జమ్ములపాలెం రోడ్డులోని డంపింగ్‌యార్డు నుంచి ఆర్వోబీ వరకు జరిగింది. అనంతరం జరిగిన సభలో కలెక్టర్ మాట్లాడుతూ చెత్తతో భూమి, గాలి, నీరు కాలుష్యం కాకుండా ప్రజలు పర్యావరణాన్ని కాపాడాల న్నారు. ఇళ్ల నుంచే వ్యర్థాలు విభజన జరగాలన్నారు. క్యాన్సర్ వ్యాధికి కారణమయ్యే సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తి, విక్రయాలు, వినియోగాన్ని నిషేధించామన్నారు. ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చెత్త నుంచి సంపద సృష్టించే కార్యక్రమంపై దృష్టి సారించామన్నారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకంతో కలిగే అనర్థాలను ప్రజలు గుర్తించి వాటి వినియోగాన్ని నిలిపివేయాలన్నారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందన్నారు. బాపుడా చైర్మన్ సలగల రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ నాగరికత మనిషి మనుగడకు ప్రమాదకరంగా మారిందన్నారు. డీఆర్వో జి.గంగాధర్‌గౌడ్ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే పర్యావరణాన్ని పరిరక్షించుకోగలమన్నారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులను సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో డీపీవో ప్రభాకరరావు, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, డిప్యూటీకలెక్టర్ లవన్న, ఆర్డీవో పి.గ్లోరియా, సీపీవో షాలెంరాజు, డీఈవో ఎస్.పురుషోత్తం, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ షేక్.సలీమా, ఐసీడీఎస్ పీడీ రాధామాధవి తదితరులు పాల్గొన్నారు.



శానిటరి సిబ్బందిని సన్మానిస్తున్న కలెక్టర్ వెంకట మురళి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

వచ్చే నెలలోనే సాగునీరు

- ఆగస్టు తొలివారంలో కుడి కాల్వకు విడుదల
- వరి సాగు తగ్గించి.. ఉద్యాన విస్తీర్ణం పెంచాలి
- సాగునీటి సలహా మండలి సమావేశంలో నిర్ణయాలు



సమావేశంలో చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యేలు యరపతినేని, అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం

నరసరావుపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు ఆగస్టు మొదటి వారంలో సాగు నీరు విడుదల చేయాలని సాగునీటి సలహా మండలి నిర్ణయించింది. జోన్-1కు తొలి దశలో నీటి సరఫరాకు ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తీర్మానించారు. పల్నాడు కలెక్టరేట్‌లో శనివారం జలవనరుల శాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్ అధ్యక్షతన సాగునీటి సలహా మండలి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే లు యరపతినేని శ్రీనివాసరావు, డాక్టర్ చదలవాడ అరవిందబాబు, కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్సీ ఏసురత్నం, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి హాజరయ్యారు. ఖరీఫ్ పంటల సాగుపై ప్రధానంగా చర్చించారు. వరి సాగు తగ్గించి ఉద్యాన పంటల విస్తీర్ణం పెంచాలని పలువురు సూచించారు. పొగాకు కంపెనీల నుంచి అనుమతి పత్రాలు ఉంటేనే బర్లీ పొగా కు సాగు చేయాలని రైతులకు సూచించారు.

పోస్టులను భర్తీ చేయాలి

సాగర్ కుడి కాల్వ పరిధిలో ఉద్యో గుల కొరత ఉందని, లస్కర్, ఏఈఈ పోస్టులను భర్తీ చేయాలని పలు వురు కోరారు. 3,500 ఎకరాలు ఉన్న బుగ్గవాగు అక్రమణలకు గురై.. రెండు వేల ఎకరాలకు తగ్గిందని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. పూడిక తీసి నీటి నిల్వ సామర్థ్యం 5 టీఎంసీలకు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పరిధిలో 30 శాతం మాత్రమే కాల్వల ఆధునికీకరణ పూర్తయిందని, చివరి భూములకు నీరు అందడం లేదని పీసీ వైస్ చైర్మన్ చక్రపాణి తెలిపారు. అధికారులు, నీటి సంఘాల సమన్వయంతో చివరి భూములకు నీరు అందించేందుకు కృషి చేయాలన్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్లకు గుంటూరు హబ్ కావాలి

విద్యార్థులకు అవగాహనా సదస్సులో మంత్రి లోకేశ్



గుంటూరు (విద్య), జూలై 19 (ఆంధ్ర జ్యోతి): చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేసే హబ్‌గా గుంటూరు కావాలని ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో శనివారం గుంటూరు అమరావతి రోడ్డులోని బండ్లమూడి గార్డెన్స్‌లో సీఏ విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో లోకేశ్ ప్రసంగించారు. గుంటూరులో వైద్యం, ఇంజనీరింగ్ విద్యను అభ్యసించే వారికంటే సీఏ అభ్యసించేవారే ఎక్కువగా ఉన్నారన్నారు. సీఏ చదివేందుకు ఏటా 10 వేల మంది గుంటూరు రావడం హర్షణీయమన్నారు. అత్యుత్తమ ప్రతిభ, అధిక ఉత్తీర్ణతా శాతంతో, సమున్నత లక్ష్యాలు కలిగిన చార్టర్డ్ అకౌంటెంట్లను తయారు చేయాలని, ఇందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. భారత దేశం గర్వపడేలా గుంటూరు నుంచి గల్ఫ్, అమెరికా, ఆస్ట్రేలియా వరకు విస్తరించిన తెలుగు చార్టర్డ్ అకౌంటెంట్లు ప్రతిభ చాటుతున్నారన్నారు.

స్మార్ట్‌మీటర్లపై అపోహలు వద్దు

◆ సెంట్రల్ పవర్ కార్పొరేషన్ సీఎండీ పుల్లారెడ్డి

బాపట్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లపై ప్రజలకు అపోహలు అవసరం లేదని సెంట్రల్ పవర్ కార్పొరేషన్ సీఎండీ పి.పుల్లారెడ్డి తెలిపారు. స్థానిక బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జిల్లా స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లో ఓల్టేజి సమస్యలు, విద్యుత్ అంతరాయాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ఇందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలన్నారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజలకు మరింత అవగాహన కలిగించాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడటంతోపాటు ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయ్యిలర్ తగ్గించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ డైరెక్టర్ ఎ.మురళీకృష్ణయాదవ్, డైరెక్టర్ ఫైనాన్స్ ఎస్.వెంకటేశ్వర్లు, డైరెక్టర్ ప్రాజెక్ట్ మూర్తి, ఎస్‌ఈ జి.ఆంజనేయులు, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సెంట్రల్ పవర్ కార్పొరేషన్ సీఎండీ పుల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల

ఖైదీలు క్షణికావేశానికి లోనుకావొద్దు

రేపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశానికి లోనై తప్పులు చేస్తే కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పీడీ వెన్నెల తెలిపారు. శనివారం స్థానిక సబ్‌జైల్‌ను సందర్శించి జైల్లో ఉన్న ఆహార సదుపాయాలు, జైలు గదులను పరిశీలించారు. అనంతరం సబ్ జైలులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఖైదీలకు న్యాయ సహాయం కోసం వారికి ఉచితంగా న్యాయవాదులను నియమిస్తామన్నారు. జైలు జీవితంలో మానసిక ప్రశాంతతను పెంపొందించుకుని సన్మార్గంలో నడవాలని సూచించారు. చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి కుమారి వి.గీతాభార్గవి, జైలుసిబ్బంది పాల్గొన్నారు.

జగన్ మెక్కిన సొమ్మంతా కక్కిస్తాం!

» బనకచర్లతో తెలంగాణకు నష్టం లేదు: నిమ్మల



చోడవరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో అక్రమాలతో జగన్ అండ్ కో లూటీ చేసిన రూ.40 వేల కోట్ల ప్రజాధనాన్ని ఈ ప్రభుత్వం కక్కించకుండా వదిలిపెట్టబోదని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొనేందుకు శనివారం అనకాపల్లి జిల్లా చోడవరానికి వచ్చిన ఆయన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇసుక, ఖనిజాలు, వనరుల దోపిడీతో పాటు, మద్యం వ్యాపారంలో కోట్లాది రూపాయలు స్వాహా చేసిన జగన్.. ఆ తప్పులకు శిక్ష తప్పదన్న భయంతోనే రాజ్యాంగం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. బనకచర్ల వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ ఉండదని తెలంగాణలోని రాజకీయ నాయకులు, మేధావులు, రైతులు, నీటి పారుదల రంగ నిపుణులు, జర్నలిస్టులు.. అందరికీ తెలుసన్నారు. అక్కడి రాజకీయ పార్టీల ఆధిపత్య పోరులో భాగంగానే బనకచర్లపై విమర్శలు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు సారథ్యంలో ఏడాది పాలన పట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తున్నదని నిమ్మల తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో 2027 డిసెంబరు నెలాఖరుకల్లా పోలవరాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, ఎమ్మెల్సీ చిరంజీవిరావు, హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో రాజారెడ్డి రాజ్యాంగం

» ప్రజలు తిరస్కరించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తెచ్చారు: మంత్రి గుమ్మడి

కొయ్యలగూడెం, జూలై 19(ఆంధ్రజ్యోతి): 'గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల రాజారెడ్డి రాజ్యాంగం నడిచింది. ప్రజలు తిరస్కరించి అంబేడ్కర్ రాజ్యాంగాన్ని ఏర్పాటు చేశారు. ఆ ఐదేళ్ల రాష్ట్రం అన్నింటా వెనుకబడింది' అని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ధ్వజమెత్తారు. ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో శనివారం ఆమె పాల్గొన్నారు. విలేకరులతో మాట్లాడుతూ 'టీడీపీ ప్రభుత్వం వచ్చాక రూ.1,300 కోట్లతో రోడ్లు నిర్మించాం. గిరిజన ప్రాంతాలను డోలీ లేని ప్రాంతాలుగా చేయాలనే లక్ష్యంతో మరో రూ.1,000 కోట్లతో రోడ్లు నిర్మిస్తాం. రూ.146 కోట్లతో గిరిజన సంక్షేమ హాస్టళ్ల అభివృద్ధి పనులు చేపట్టనున్నాం' అని పేర్కొన్నారు.

జగన్‌వి విలువల్లేని రాజకీయాలు: అనిత

విజయనగరం, జూలై 19(ఆంధ్రజ్యోతి): జగన్ 2019 నుంచి 2024 వరకు విలువల్లేని రాజకీయాలు చేయడం వల్లే అధఃపాతాళానికి వెళ్లారని హోంమంత్రి అనిత అన్నారు. గోవా గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజును శనివారం ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు, అయ్యన్న, అశోక్ గజపతిరాజు వంటి వారిని లక్ష్యంగా చేసుకుని జగన్ కుతంత్రాలు చేశారన్నారు.

ఆంధ్రతో మా ప్రయాణం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

'తెలుగు ప్రకటన అద్భుతంగా ఉంది. ఆంధ్రప్రదేశ్ మీ వాహనాలకు అతిపెద్ద మార్కెట్. ఈ ప్రకటనను కూడా ప్రజలు తప్పకుండా ఇష్టపడతారు. అత్యాధునిక ఆటోమోటివ్ వ్యవస్థ, అతి పెద్ద మార్కెను ఉపయోగించుకోవడానికి మా రాష్ట్రంలో వాహన తయారీ పరిశ్రమ స్థాపనకున్న అవకాశాలను పరిశీలించండి. మీ బృందాన్ని స్వాగతించడానికి, మా వద్దనున్న అవధులులేని అవకాశాలను వివరించడానికి మేం సిద్ధంగా ఉన్నాం' అని పేర్కొన్నారు. లోకేశ్ సందేశానికి ఆనంద్ మహీంద్ర స్పందిస్తూ... 'ధన్యవాదాలు. ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవకాశాలు ఉన్నాయి. ఏపీ ప్రగతి ప్రస్థానంలో భాగస్వాములం కావడం మాకు గర్వకారణం. ఇప్పటికే మా బృం దాలు పలు రంగాలు.. సౌరవిద్యుత్, మైక్రో ఇరిగేషన్, పర్యాటకంలో పె ట్టుబడులు పెట్టే అంశాన్ని పరిశీలిస్తున్నాయి. మన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైంది... ముందు ఏమి ఉందో చూద్దాం..!' అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

తక్కువ ఖర్చుతోనే గ్రీన్ హైడ్రోజన్

ఏపీలో మూడు పరిశోధన క్లస్టర్లు.. ఏపీ అసోసియేషన్ ఏర్పాటవ్వాలి

» అమరావతి సమ్మిట్ డిక్లరేషన్

» రేపు ప్రభుత్వానికి నివేదన

» ఏపీలో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చిన మరో సంస్థ



గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ ముగింపు రోజున చర్చల్లో పాల్గొన్న శాస్త్రవేత్తలు, నిపుణులు

గుంటూరు/మంగళగిరి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయడానికి విస్తృతంగా పరిశోధనలు జరగాలని గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ అభిప్రాయపడింది. అమరావతిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజులు జరిగిన గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ శనివారం ముగిసింది. రెండో రోజు మేధావులు పలు అంశాలపై చర్చలు జరిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మూడు గ్రీన్ హైడ్రోజన్ పరిశోధన క్లస్టర్లను ఏర్పాటు చేయడానికి, జాతీయ స్థాయిలో వలే గ్రీన్ హైడ్రోజన్ ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్‌ను నెలకొల్పడానికి, హరిత ఉదజని ఉత్పత్తి ఖర్చును సగానికి తగ్గించేందుకు నిరంతరం పరిశోధన, అభివృద్ధి కార్యకలాపాలు రాష్ట్రంలో కొనసాగించడానికి ఈ సదస్సులో డిక్లరేషన్ రూపొందించారు. ఆ డిక్లరేషన్‌ని సోమవారం ప్రభుత్వానికి నివేదించనున్నారు. సదస్సులో చర్చించిన అంశాలను ఎస్ఆర్ఎం గ్రూపు సంస్థల రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ డి.నారాయణరావు వివరించారు. తొలి రోజు సీఎం సమక్షంలో జరిగిన రూ. 51 వేల కోట్ల పెట్టుబడుల ఒప్పందాలతో పాటు అమెరికాకు చెందిన సినర్‌జెన్ సీఈవో ప్రణవ్ తాంతి ఆంధ్రప్రదేశ్‌లో మరో 40 వేల టన్నుల సామర్థ్యం గల గ్రీన్ హైడ్రోజన్ పరిశ్రమ ఏర్పాటుకు అంగీకారం తెలిపారని చెప్పారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి ఖర్చుని రూ. 400 నుంచి రూ. 200కు తగ్గించాలని, వచ్చే రెండు, మూడేళ్లలో హైడ్రోజన్‌తో నడిచే కారు, రైలుని వినియోగంలోకి తీసుకురావాలని డిక్లరేషన్‌లో పొందుపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొ-వైస్ చాన్సలర్ డాక్టర్ సతీష్‌కుమార్, నెడ్‌క్యాప్ ఏపీ ఎండీ కమలాకర్‌బాబు, సుజిత్ ఎంఎస్ఆర్‌ఈ నుంచి డాక్టర్ సుజిత్ పిళ్లై, మారం పార్థసారథి, సుజిత్ కల్లూరి పాల్గొన్నారు.

అమరావతిలో హైడ్రోజన్ వ్యాలీ



అమరావతిలో హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటుపై రెండో రోజు డిక్లరేషన్ ప్రవేశపెట్టడం జరిగింది. రెండు రోజుల సమ్మిట్‌లో ప్రముఖుల అభిప్రాయాలు, చర్చకు వచ్చిన అంశాలను పరిగణనలోకి తీసుకుని డిక్లరేషన్‌ను రూపొందించాం. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఆర్ అండ్ డీ ప్రతినిధులు, వివిధ సంస్థలు, సైంటిస్టులు, ప్రొఫెసర్లు సమ్మిట్‌కు హాజరయ్యారు. రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ అభివృద్ధి, వివిధ పాలసీలపై చర్చించారు. అమరావతికి గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ వస్తే రాజధాని ప్రాంతం మరింతగా అభివృద్ధి చెందుతుంది.

-డాక్టర్ పార్థసారథి (సమ్మిట్ కన్వీనర్, ఎస్ఆర్ఎం)

భవిష్యత్తులో శిలాజ ఇంధనాల కొరత



ప్రస్తుతం మనం వినియోగిస్తున్న శిలాజ ఇంధనాలు భవిష్యత్తులో దొరక్కపోవచ్చు. ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేసుకోవాలి. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి, టెక్నాలజీ అభివృద్ధి, స్టార్టప్ కంపెనీలను ప్రోత్సహించేందుకు నేషనల్ గ్రీన్ హైడ్రోజన్ మిషన్ ఎంతగానో ఉపయోగపడుతోంది. పంట వ్యర్థాలతో స్థిరమైన ఇంధన శక్తిని ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

- డాక్టర్ మల్లికార్జునరావు (సీఈవో, శక్తి ఫోటాన్ సొల్యూషన్స్)

కార్బన్ రహిత సమాజానికి దోహదం



కార్బన్ రహిత సమాజానికి గ్రీన్ హైడ్రోజన్ ఒక ఆశాజనకమైన మార్గం. గ్లోబల్ వార్మింగ్ విపత్తు నుంచి బయటపడాలంటే హైడ్రోజన్ ఇంధన వనరులను గణనీయంగా ఉత్పత్తి చేయాలి. ఇప్పుడున్న టెక్నాలజీతో గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చాలా ఖర్చుతో కూడుకుంది. దాని స్టోరేజీ, ట్రాన్స్‌పోర్టేషన్, వనరుల వినియోగం కూడా ప్రధానం. ఈ అంశాలపై సదస్సులో నిపుణులు చర్చించారు. గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. విశాఖపట్నం, కాకినాడలో త్వరలో గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్లు ఏర్పాటు కానున్నాయి.

- అనిల్‌కుమార్ (ఆర్ అండ్ డీ డీన్, తిరుపతి ఐఐటీ)

మున్సిపల్ కమిషనర్ పేరుతో వసూళ్లు!

వ్యాపారులకు క్యూఆర్ కోడ్ పంపి డబ్బులు స్వాహా

తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో కేసులు నమోదు

నెల్లూరులో అరెస్టు చేసిన దర్గామిట్ట పోలీసులు

నెల్లూరు(క్రైం), జూలై 19(ఆంధ్రజ్యోతి): దొంగతనాలు, దోపిడీలతో రిస్కు అనుకున్నాడో ఏమో.. కాలు కదల్చకుండా దర్జాగా నగదు దోచుకోవడానికి ప్రణాళిక వేశాడో ఓ ప్రబుద్ధుడు. ఏకంగా మున్సిపల్ కమిషనర్ అవతారం ఎత్తి, పన్ను బకాయిలు చెల్లించాలంటూ వ్యాపారులను బెదిరించి, దోచుకోవడం మొదలుపెట్టాడు. ఈ కేటుగాడిని నెల్లూరు దర్గామిట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. వైఎస్ఆర్ కడప జిల్లా బీ కోడూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన బిల్లా నాగేశ్వరరావు రెండు తెలుగు రాష్ట్రాల్లోని వ్యాపారులకు మున్సిపల్ కమిషనర్ పేరిట ఫోన్‌చేసి వాణిజ్య పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని ఒత్తిడి చేసేవాడు. వారి మొబైల్ ఫోన్లకు తన బ్యాంకు ఖాతా క్యూఆర్ కోడ్ పంపి అందులో డబ్బులు వేయించుకునేవాడు. నెల్లూరుకు చెందిన ఫైరర్స్ యజమాని రియాజ్ బాషాకు గతనెల 17న నిందితుడు ఫోన్ చేశాడు. వారి సంస్థ పేరుపై రూ.2,100 మున్సిపాలిటీకి బకాయి ఉందని, వెంటనే తాను పంపిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్‌చేసి నగదు చెల్లించాలని ఆదేశించాడు. ట్రేడ్ లైసెన్స్ చెల్లించామని రియాజ్ చెప్పినా వినిపించుకోలేదు. దీంతో ఆయన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నగదు చెల్లించారు. కొద్దిసేపటి తర్వాత నిందితుడు మళ్లీ ఫోన్ చేసి మరో రూ.1,200 చెల్లించాలని కోరాడు. దీంతో అనుమానం వచ్చిన రియాజ్ నగర కార్పొరేషన్ కార్యాలయంలో ఆరా తీయడంతో అసలు విషయం బయటపడింది. దీనిపై బాధితుడు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నెల్లూరులోని పొదలకూరు రోడ్డు వద్ద నిందితుడు బిల్లా నాగేశ్వరరావును అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌స్పెక్టర్ రోశయ్య చెప్పారు. కాగా, నిందితుడిపై బీ కోడూరు, బద్వేలు, కడప, గుంతకల్, తెలంగాణలోని గద్వాలలో కేసులు నమోదయ్యాయి.

అతనికి బెయిల్ ఇవ్వలేం!

» యజమాని భార్యను హత్య చేసి.. శవంతో వాంఛ తీర్చుకున్న వ్యక్తి

» బెయిల్ నిరాకరించిన హైకోర్టు

» మృగంలా వ్యవహరించాడని వ్యాఖ్య

» బెయిల్ ఇస్తే సమాజంపై ప్రతికూల

» ప్రభావం పడుతుందన్న న్యాయస్థానం



అమరావతి, జూలై 19(ఆంధ్రజ్యోతి): తాను పనిచేస్తున్న ఆసుపత్రి యజమాని భార్యను హత్య చేసి, అనంతరం ఆమె మృతదేహంతో లైంగిక వాంఛ తీర్చుకున్న వ్యక్తికి బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఇలాంటి కేసులో బెయిల్ మంజూరు చేస్తే సమాజంపై ప్రతికూల ప్రభావం పడుతుందని పేర్కొంది. యజమాని భార్యపై లైంగిక వ్యామోహంతో నిందితుడు మృగంలా వ్యవహరించాడని, ఆమె ప్రతిఘటించడంతో విషయం బయట పడుతుందని దారుణంగా హత్య చేశాడని కోర్టు తెలిపింది. అనంతరం, మృతదేహంతో కామవాంఛ తీర్చుకున్నాడని పేర్కొంది. దీనికి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని, వాస్తవాలను ట్రయల్ కోర్టు తేలుస్తుందని తెలిపింది. చాలాకాలం నుంచి జైలులో ఉన్నాడనే కారణంతో ఇలాంటి తీవ్రమైన కేసులో బెయిల్ పొందేందుకు పిటిషనర్ అనర్హుడని తేల్చి చెప్పింది. నేరానికి పాల్పడిన విధానం, నేర తీవ్రత, సమాజంపై చూపించే ప్రభావం, తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని బెయిల్ పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మల్లికార్జునరావు ఇటీవల ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు జిల్లా కావలిలో ఓ వైద్యుడు 15 ఏళ్లుగా ఆసుపత్రి నిర్వహిస్తున్నారు. పశ్చిమబెంగాల్‌కు చెందిన నిందితుడు నయన్ బిస్వాస్ ఈ ఆసుపత్రిలో కాంపౌండర్‌గా చేరారు. యజమాని కుటుంబ సభ్యులతో కలిసి ఉంటున్న అతను 2024, డిసెంబరు 31 తెల్లవారు జామున యజమాని భార్యపై లైంగిక వాంఛ తీర్చుకునేందుకు ప్రయత్నించాడు. ఆమె ప్రతిఘటించడంతో తలపై బలంగా కొట్టి హత్య చేశాడు. మృతదేహాన్ని నిర్జన ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వాంఛ తీర్చుకున్నాడు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కావలి వన్‌టౌన్ పోలీసులు నయన్ బిస్వాస్‌పై కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తి చేసి ప్రాథమిక చార్జిషీట్ దాఖలు చేశారు. కారాగారంలో ఉన్న నిందితుడు బిస్వాస్ పోలీసులు చార్జిషీట్ దాఖలు చేసినందున బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు.

కూటమి ప్రభుత్వ కృషిని

ప్రజల్లోకి తీసుకెళ్లండి

» మాధవ్‌కు జేపీ నడ్డా దిశానిర్దేశం

న్యూఢిల్లీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ కృషిని ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పీవీఎన్ మాధవ్‌కు దిశానిర్దేశం చేశారు. పార్టీ రాష్ట్ర బాధ్యతలు చేపట్టిన తరువాత తొలిసారిగా మాధవ్, నడ్డాతో శనివారం ఢిల్లీలో భేటీ అయ్యారు. క్షేత్ర స్థాయిలో పార్టీని పటిష్ఠం చేయడం, రాష్ట్రాభివృద్ధికి కూటమి సర్కారు నిరంతరం శ్రమిస్తున్న విషయాలను ప్రజల్లోకి తీసుకొని వెళ్లాలని నడ్డా సూచించారు. సమష్టి కృషితో పార్టీని మరింత పటిష్ఠం చేస్తానని మాధవ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కేరళలో పాట చిత్రీకరణ



మెగాస్టార్ చిరంజీవి, నయనతార జంటగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం ('మెగా157-వర్కింగ్ టైటిల్)' షూటింగ్ కేరళలో శరవేగంగా సాగుతోంది. ప్రస్తుతం కేరళలోని అందమైన లొకేషన్లలో చిరంజీవి, నయనతారపై పెళ్లి నేపథ్యంలో ఓ పాటను చిత్రీకరిస్తున్నారు. 'కొన్ని కీలకమైన ఘట్టాలను కూడా ఈ షెడ్యూల్‌లో షూట్ చేస్తున్నాం. ఈనెల 23 నాటికి ఈ షెడ్యూల్ పూర్తవుతుంద'ని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు. సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రేక్షకుల ముందుకు రానుంది.

గాయపడిన షారుక్.. షూటింగ్‌కు బ్రేక్



సినిమా కోసం చెమటోడ్చే హీరోల్లో షారుక్ ఖాన్ ముందుంటారు. ప్రేక్షకులను అలరించడానికి మూడు దశాబ్దాలుగా ఆయన కృషి చేస్తూనే ఉన్నారు. 60 ఏళ్ల వయసులోనూ తెరపై షారుక్ చేసే సాహసాలు అబ్బురపరుస్తూంటాయి. డూప్ లేకుండా యాక్షన్ సీన్లలో పాల్గొనే షారుక్ తాజాగా 'కింగ్' చిత్రం షూటింగ్‌లో ప్రమాదానికి గురయ్యారు. ముంబైలోని గోల్డెన్ టుబాకో స్టూడియోలో ఓ భారీ యాక్షన్ ఎపిసోడ్ తీస్తున్నప్పుడు ఈ సంఘటన జరిగింది. అయితే ఇది తీవ్రమైన గాయం కాదు, కండరానికి సంబంధించింది కనుక చికిత్స అవసరం అని అమెరికాకు ఆయన్ని తీసుకెళ్లారు. నెల రోజుల పాటు షారుక్‌కు విశ్రాంతి అవసరమని వైద్యులు వెల్లడించారు. దీంతో ఆగస్టు నెల వరకూ ఏకధాటిగా జరగాల్సిన 'కింగ్' షూటింగ్‌కు బ్రేక్ ఇచ్చారు. షారుక్ కోలుకుని తిరిగి వచ్చిన తర్వాత సెప్టెంబర్‌లో కానీ అక్టోబర్‌లో కానీ మళ్లీ షూటింగ్‌ను ప్రారంభిస్తామని యూనిట్ సభ్యులు చెబుతున్నారు. ఇండియాతో పాటు యూరప్‌లో కూడా 'కింగ్' షూటింగ్ జరపాలని ప్లాన్ చేశారు. షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ప్రధాన పాత్ర పోషిస్తున్న 'కింగ్' చిత్రాన్ని సిద్ధార్థ్ ఆనంద్ రూపొందిస్తున్నారు.

ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే చిత్రం

- నిర్మాత ఏ.ఎం.రత్నం



'మొఘల్ సామ్రాజ్య చక్రవర్తుల కాలంనాటి కథే 'హరిహర వీరమల్లు'. బయట ప్రచారం జరుగుతున్నట్టుగా ఇది నిజ జీవిత కథ కాదు. ఓ కల్పిత పాత్రను తీసుకొని, దాని చుట్టూ కథ అల్లాము. హరిహర అంటే విష్ణువు, శివుడు కలయిక. ఆ రెండు పేర్లు సూచించేలా వీరమల్లు అని పెట్టాము. 'హరిహర వీరమల్లు' ప్రేక్షకుల హృదయాల్లో నిలిచిపోయే గొప్ప చిత్రం అవుతుంది' అని అన్నారు నిర్మాత ఏ.ఎం. రత్నం. పవన్ కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతి కృష్ణ దర్శకత్వంలో ఆయన నిర్మించిన 'హరిహర వీరమల్లు' ఈనెల 24న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు.

- నేను 'భారతీయుడు' సహా ఎన్నో భారీ చిత్రాలను నిర్మించాను. అయితే నా సినీ జీవితంలో ఇంత సుదీర్ఘ ప్రయాణం చేసిన సినిమా ఇదే. దానికి ఎన్నో కారణాలు ఉన్నాయి. షూటింగ్ పూర్తవడానికి బాగా ఆలస్యమవడంతో సినిమా ఎలా ఉంటుందోననే అనుమానాలు కొందరు వ్యక్తం చేశారు. అయితే ట్రైలర్ విడుదలతో వారి అనుమానాలు పటాపంచలు అయ్యాయి. నేను నిర్మించిన సినిమాల్లో 90 శాతానికి పైగా విజయం సాధించాయి. ఆ అనుభవంతో చెబుతున్నా... 'హరిహర వీరమల్లు' ఘన విజయం సాధిస్తుంది.
- సినిమాను మొదట రెండు భాగాలు అని అనుకోలేదు. సినిమా వినోదంతో పాటు, సందేశాన్ని అందించాలనేది నా భావన. నేను రూపొందించిన సినిమాలు అలాగే ఉంటాయి. చారిత్రక నేపథ్యమున్న కథ. ఇలాంటి గొప్ప కథలో సందేశం ఉంటే..ఎక్కువ మందికి చేరువవుతుందని భావించాము. అలా చర్చలో కథ విస్తృతి పెరిగింది.
- 'ఖుషి, 'బంగారం' తర్వాత పవన్ కల్యాణ్‌తో చేసిన మూడో చిత్రమిది. పేరుకు మూడు సినిమాలే కానీ.. మా మధ్య 25 ఏళ్ల అనుబంధం ఉంది. పవన్ కల్యాణ్‌ని దగ్గర నుంచి చూసిన వ్యక్తిగా.. ఓ నటుడిగా కంటే కూడా మంచి ఆశయాలున్న మనిషిగా ఆయనను నేను ఎక్కువగా ఇష్టపడతాను.
- మా అబ్బాయి అని చెప్పడం కాదు గానీ.. జ్యోతికృష్ణ దర్శకత్వ ప్రతిభ చూసి ఆశ్చర్యపోయాను. మేమందరం చూడని ఓ కొత్త కోణంలో ఈ కథని సిద్ధం చేశాడు. మన చరిత్రను ముడిపెడుతూ ఈ తరానికి చేరువయ్యేలా 'ఇండియానా జోన్స్' తరహాలో సినిమాని గొప్పగా మలిచాడు.

ఏపీలో 'హరిహర వీరమల్లు' టికెట్ ధర పెంపు

● 14 రోజులు అడిగిన మేకర్స్.. పది రోజులకే అనుమతి..

'హరిహర వీరమల్లు' టికెట్ ధరలు పెంచుకోవడానికి ఏపీ ప్రభుత్వం అనుమతిచ్చింది. ఈ నెల 24న థియేటర్లలో విడుదల కాబోతున్న ఈ సినిమాకు 14 రోజుల పాటు అదనపు రేట్లకు అనుమతించాలని ప్రభుత్వానికి మేకర్స్ విన్నవించారు. పరిశీలించి పది రోజుల పాటు పెంపునకు అనుమతిచ్చిన రాష్ట్ర ప్రభుత్వం 23 రాత్రి 9.30 గంటలకు సెకండ్ షో, 24వేకువ జామున 4గంటలకు బెనిఫిట్ షోలకు అనుమతి పెండింగ్‌లో పెట్టింది. పవన్ కల్యాణ్ ఏపీ డిప్యూటీ సీఎం అయ్యాక విడుదలవుతోన్న మొదటి సినిమా కావడంతో అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. దిగువ తరగతి రూ.100, అప్పర్ క్లాస్ రూ.150, మల్టీప్లెక్స్ రూ.200 అదనంగా పెంచుకోవడానికి అనుమతి లభించడంతో సినిమా టిక్కెట్ల ధరలు సింగిల్ స్క్రీన్‌లో బాల్కనీ రూ.250, మధ్య తరగతి రూ.150-190, మల్టీప్లెక్స్‌లలో రూ.350దాకా ఉండబోతున్నాయి.

అమరావతి (ఆంధ్రజ్యోతి)

సందేశంతో రాజు గాని సవాల్



లెలిజాల రవీందర్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తోన్న చిత్రం 'రాజు గాని సవాల్'. రితికా చక్రవర్తి కథానాయిక. రక్షా బంధన్ పండుగ సందర్భంగా ఆగస్టు 8న శ్రీ లక్ష్మీ పిక్చర్స్ ద్వారా విడుదలకు సిద్ధమవుతోంది. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ట్రైలర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా లెలిజాల రవీందర్ మాట్లాడుతూ 'నా జీవితంలో జరిగిన కొన్ని నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. కల్చరల్ ఈవెంట్స్ నేపథ్యంలో కథ సాగుతుంది. ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం ఇచ్చే చిత్రమిది' అని తెలిపారు. నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ 'సినిమా టీజర్ చూశాం చాలా బావుంది. ఇప్పుడు ట్రైలర్ కూడా ఆకట్టుకుంటోంది. రవీందర్ కొత్తతరహా కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరు ప్రేక్షకులను అలరిస్తుంది' అని అన్నారు.

సామ్రాజ్య టైటిల్‌తో



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటించిన 'కింగ్‌డమ్' చిత్రం ఈ నెల 31న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతున్న విషయం తెలిసిందే. శనివారం చిత్రబృందం హిందీ టైటిల్‌ను ప్రకటించింది. అక్కడ ఈ చిత్రాన్ని 'సామ్రాజ్య' పేరుతో హిందీలో విడుదల చేస్తున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్‌ను గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. సంగీతం: అనిరుధ్

కిల్లర్ లుక్



ఎస్. జే సూర్య కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. వీసీ ప్రవీణ్, బైజు గోపాలన్ కలసి నిర్మిస్తున్నారు. ప్రీతి అస్రాని కథానాయిక. ఇటీవలే చిత్రీకరణ మొదలైంది. శనివారం చిత్రబృందం ఫస్ట్‌లుక్‌ను విడుదల చేసింది. గన్ పట్టుకొని, ప్రీతి అస్రానీని భుజాన ఎత్తుకున్న లుక్ ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు.

ఫిష్ వెంకట్‌కు ప్రముఖుల నివాళి



నటుడు ఫిష్ వెంకట్ శుక్రవారం రాత్రి మరణించిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. సినీ పరిశ్రమ ఓ విలక్షణ నటుడిని కోల్పోయిందని అన్నారు. ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, టి. పద్మారావు గౌడ్, నటి కరాటే కల్యాణి, కమెడియన్ రచ్చ రవి తదితరులు శనివారం ఉదయం అడ్డగుట్టలోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

అడ్డగుట్ట (ఆంధ్రజ్యోతి)

విద్యార్థి దశ సద్వినియోగంతోనే ఉజ్వల భవిష్యత్తు

● జస్టిస్ జ్యోతిర్మయికి విజయలక్ష్మి స్మారక పురస్కారం



జస్టిస్ జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులను విజయలక్ష్మి పురస్కారంతో సత్కరిస్తున్న వీసీలు శివరామకృష్ణ, కృపాచారి, సత్యనారాయణ

తెనాలి అర్బన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశను సద్వినియోగం చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని హైకోర్టు న్యాయమూర్తి వెంకటజ్యోతిర్మయి ప్రతాప పేర్కొన్నారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో శనివారం మొవ్వా విజయలక్ష్మి స్మారక సేవా సమితి ఆధ్వర్యంలో.. జ్యోతిర్మయి, శ్రీనివాస్ దంపతులను విజయలక్ష్మి స్మారక పురస్కారం ప్రదానం చేసి, ఘనంగా సత్కరించారు. సమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సభలో విద్యార్థులు-భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై న్యాయమూర్తి మాట్లాడారు. ఓటమి అనేది శత్రువుల వల్ల రాదని, మనసులో భయం ఉంటేనే వస్తుందన్నారు. జేఎన్‌టీయూ వైస్ చాన్సలర్ చేకూరి శివరామకృష్ణ ప్రసాద్, దళిత సార్వత్రిక విశ్వ విద్యాలయం వీసీ గుజ్జర్లమూడి కృపాచారి, తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ, ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కొలసాని రాంచంద్ ప్రసంగించారు. పదవ తరగతి పరీక్షల్లో 550కి పైగా మార్కులు సాధించిన 60 మంది విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున నగదు, జ్ఞాపికను అందజేశారు. ఈదర వెంకటపూర్ణచంద్, ప్రసాద్, నాగభూషణం, తాతాజీ, ఈశ్వర్‌చంద్, జగదీశ్వరి, బెల్లంకొండ వెంకట్ పాల్గొన్నారు.

ప్రజల్లో విషబీజాలు నాటేందుకు వైసీపీ పన్నాగం

ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లపాటు చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ నియోజకవర్గా లను అప్పనంగా దోచుకున్న వైసీపీ దొంగల ముఠా ప్రజల్లో విషబీజాలు నాటే ప్రయత్నం చేస్తున్నా రని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ఆరోపించారు. చిలకలూరిపేట



మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి పర్యటించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి

మండలం కావూరు, కోమటినేనివారిపాలెం, గంగన్నపాలెంలో కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో కలిసి ఎమెల్యే ప్రత్తిపాటి రూ.30 లక్షల నిధులతో సీసీ రోడ్లు, రూ.10లక్షలతో గ్రావెల్ రోడ్ల పనులకు శంకుస్థాపన చేసి, కోమటినేనివారిపాలెం ప్రభుత్వ పాఠశాలలో రూ.3 లక్షలతో నిర్మించిన తాగునీటి ప్లాంట్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి మాట్లాడుతూ నిన్నటి రోజున వైసీపీ దొంగల ముఠా అంతా చిలకలూరిపేటకు వచ్చి పచ్చి అబద్ధాలు ఆడిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరీముల్లా, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, కందుల రమణ, అరెకట్ల కోటేశ్వరరావు, కావూరు రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విశ్రాంత విద్యాశాఖాధికారి మృతి

పిట్టలవానిపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో విశ్రాంత విద్యాశాఖాధికారి శనివారం మృతి చెందారు. పిట్టలవానిపాలెం గ్రామ పంచాయతీకి చెందిన వేగేశన వెంకటేశ్వరరాజు (77) ద్విచక్ర వాహనంపై జీఎస్‌పాలెం గ్రామంలో ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా.. గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొంది. వెంకటేశ్వరరాజు గతంలో విద్యాశాఖాధికారిగా విధులు నిర్వహించి, 2006లో ఉద్యోగ విరమణ పొందారు. చందోలు ఎస్సై ఎం.వెంకటశివకుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి

● డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



ప్లాస్టిక్ బాటిళ్లు తొలగిస్తున్న చైర్మన్ మక్కెన, జంగా తదితరులు

గుంటూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. గుంటూరు బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ప్లాస్టిక్ నిషేధంపై ఉద్యోగులు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మానవహారం నిర్వహించారు. బ్యాంకు చైర్మన్ మక్కెనతో పాటు టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి, బ్యాంకు మాజీ చైర్మన్ మానం వెంకటేశ్వర్లుతో కలిసి ఉద్యోగులు బ్యాంకులోని ప్లాస్టిక్ బాటిల్స్ ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. చైర్మన్ మక్కెన మాట్లాడుతూ పరిపాలన కార్యాలయంలో ఉద్యోగులందరికి తన ఖర్చుతో స్టీల్ వాటర్ బాటిల్స్‌ను అందజేస్తానని తెలిపారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని ఉద్యోగులందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో అజయ్‌కిషోర్, జీఎంలు కృష్ణవేణి, ఫణికుమార్, స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర బ్యాంక్ నోడల్ అధికారులు మాధవి, కె.బాలాజీ ప్రసాద్ తదితరులున్నారు.

పెట్రోల్ దాడి కేసులో నిందితుడికి రిమాండ్

నూజెండ్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): పెట్రోల్ పోసి నిప్పంటించడంతో మహిళ మృతికి కారణమైన నిందితుడికి కోర్టు శనివారం రిమాండ్ విధించింది. వివరాల మేరకు.. ఐనవోలు గ్రామంలో ఈ నెల 16న ఆరుబయట నిద్రిస్తున్న దంపతులపై నీలబోయిన యలమంద పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ ఘటనలో నీలబోయిన మంగమ్మ మృతి చెందింది. నిందితుడిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ టీవీ కృష్ణారావు తెలిపారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు పికెట్ నిర్వహిస్తున్నామన్నారు.

పల్నాడును ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దండి

కలెక్టర్ అరుణ్‌బాబు



కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పల్నాడును ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. శనివారం నరసరావు పేటలో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత, ప్లాస్టిక్ నిర్మూలనపై ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ప్లాస్టిక్‌ను నిర్మూలించడం ఎంతో ముఖ్యం అన్నారు. ప్రధానంగా సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను వాడడం ఆపి జూట్ బ్యాగులను వినియోగించాలని సూచిం చారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించి, జూట్ బ్యాగులు, స్టీల్ వాటర్ బాటిల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ నిర్మూలన, ప్రత్యామ్నాయాల వినియోగంపై అవగాహన కల్పించే దిశగా ప్రయత్నిస్తాననని విద్యార్థులు, ప్రజలతో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు, ఆర్డీవో ఎం.మధు లత, మున్సిపల్ కమిషనర్ ఎం.జశ్వంత్‌రావు పాల్గొన్నారు.

మాచవరం పెట్రోల్ బంకులో తనిఖీలు



మాచవరం బంకులో పెట్రోల్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో ప్రసాదరావు

మాచవరం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మాచవరం పెట్రోల్ బంకులో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి, సత్తెనపల్లి తూనికలు, కొలతలు అధికారి జాన్ సైదా శనివారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ బంకులో శుక్రవారం పెట్రోల్‌కు బదులు నీళ్లు కొట్టారని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో.. అధికారులు స్పందించారు. బంకులో ఉన్న పెట్రోల్‌ను పరిశీలించగా.. నీళ్లు లాగా వస్తుండటం గమనించారు. సేల్స్ ఆఫీసర్ తనిఖీ చేసి పంపుల ద్వారా వచ్చే పెట్రోల్ నాణ్యతను నిర్ధారించాల్సి ఉందని డీఎస్‌వో తెలిపారు. తూనికలు, కొలతల అధికారి జాన్ సైదా లీటర్ల పరిమాణం పరిశీలించారు. అనంతరం డీఎస్‌వో ప్రసాదు పెట్రోల్ బంకు రికార్డులు తనిఖీ చేయగా స్టాక్ రిజిస్టర్‌లో వ్యత్యాసాలు లేవని తెలిపారు. పెట్రోల్ బంకుకు సంబంధించి నివేదిక తయారు చేసి, జిల్లా జాయింట్ కలెక్టర్‌కు సమర్పించనున్నట్టు పేర్కొన్నారు. తనిఖీల్లో స్థానిక తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, డీటీ స్రవంతి, డీఎస్‌వో ఆఫీస్ డీటీ ప్రభాకరరావు, ఆర్ఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేద్దాం

డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సురేష్ చంద్



స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పోగ్రాం అధికారి డాక్టర్ సురేష్ చంద్

సత్తెనపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని, అందుకు సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను నిషేధించాలని డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ ప్రోగ్రామింగ్ అధికారి డాక్టర్ సురేష్ చంద్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం ఏరియా వైద్యశాలలో నిర్వహించారు. డైరెక్టర్ సురేష్ చంద్ మాట్లాడుతూ ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, వాటర్ బాటిల్స్ వాడ కూడదన్నారు. ఏరియా వైద్యశాలలో డాక్టర్లతో కలసి మొక్కలు నాటారు. అనంతరం స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, డాక్టర్లు లక్ష్మణరావు, ఆర్ఎంవో రాధాకృష్ణ, పలువురు డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఏరియా వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పురపాలక సంఘ డీఈ మధుసూదనరావు ఆధ్వర్యంలో కార్యాలయం నుంచి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ సారథి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కులగణన విధివిధానాలు బహిర్గతం చేయాలి

● బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు

నరసరావుపేట టౌన్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రం జనగణనతో పాటు చేపడుతున్న సమగ్ర కుల గణన విధి విధానాలు బహిర్గతం చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు డిమాండ్ చేశారు. శనివారం నరసరావుపేటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. జనగణన అనంతరం ఓబీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలని కోరారు. స్థానిక సంస్థల్లో 34 శాతం, చట్టసభలలో 33 శాతం బీసీలకు రిజర్వేషన్ ఇచ్చేలా కూటమి సర్కార్ ఎన్నికల వాగ్దానం ఇచ్చిందని గుర్తుచేశారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు పరిమితిని అధిగమించేలా రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీను, పట్టణ అధ్యక్షుడు కొల్లిపర బాలాజీ, సుతారం విశ్వేశ్వరరావు, గాలి సాంబశివరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకరరావు తదితరులు

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శుక్రవారం నాటికి 565.00 అడుగులు ఉంది. ఇది 244.14 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1,800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 1800 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా, శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 67,800 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో శనివారం 13.35 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 8,622 క్యూసె క్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు వద్ద లీకుల ద్వారా నాలుగు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతోంది.

కాలుష్య రహిత సమాజం కోసం స్వచ్ఛాంధ్ర

జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా

గుంటూరు సిటీ, జూలై 19(ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత సమాజం కోసమే కూటమి ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఏర్పాటు చేసిందని జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టీనా పేర్కొన్నారు. శనివారం జడ్పీ కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్లాస్టిక్ కాలుష్య నియంత్రణ అంశాన్ని ప్రజల్లోకి తీసుకు వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఐటీసీ సంస్థ అందజేసిన గుడ్డ సంచులు పంపిణీచేశారు.సీఈఓ జ్యోతి బసు, డిప్యూటీ సీఈఓ చొప్పర కృష్ణ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	113, 121, 132
చికెన్ విత్ స్కిన్(కిలో)	216.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	226.00

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



అధికారులతో కలిసి డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

డంపింగ్ యార్డును పరిశీలించిన ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జమ్ములపాలెం రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డును అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ శనివారం పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్తను వేరుచేసే విధానాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న చెత్తను జిందాల్‌కు తరలిస్తున్నామని కమిషనర్ జి.రఘునాథరెడ్డి తెలిపారు. మొత్తం చెత్త తరలించటానికి ఎన్నిరోజులు పడుతుందని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 15.8 ఎకరాలు ఉన్న డంపింగ్ యార్డు చుట్టూ రూ.50 లక్షలు వెచ్చించి ప్రహరీ నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, నాయకులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ, జి.గిరిజారాణి, కూచిపూడి శ్యామ్‌సుందర్, శీలం శ్రీనివాసరావు, ఆవుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబాలను బలోపేతం చేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబాలను పీ4 విధానం ద్వారా ఆర్థికంగా బలోపేతం చేయవచ్చని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. మండలంలోని నందిరాజుతోట గ్రామంలోని సచివాలయం వద్ద శనివారం నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నందిరాజుతోట, హైదర్‌పేట గ్రామాలలో 39 మందిని బంగారు కుటుంబాలుగా ఎంపిక చేశారని, ఇప్పటి వరకు రెండు గ్రామాలలో 106 మందిని బంగారు కుటుంబాలుగా ఎంపిక చేయటం జరిగిందన్నారు. నీడ్ బేస్డ్ సర్వే సోమవారం నుంచి మొదలు పెట్టటం జరుగుతుందని కలెక్టర్ సచివాలయ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది బంగారు కుటుంబాలకు ఎన్నికైన కుటుంబాలకు వెళ్ళి వారి అవసరాలను తెలుసుకొని యాప్‌లో నిక్షిప్తం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, సీపీవో షాలెంరాజు, బీసీ సంక్షేమాధికారి శివలీల, ఆర్డీవో పి.గ్లోరియా, ఎంపీడీవో బాబురావు, గ్రామ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, సంగం డెయిరీ డైరెక్టర్ మరీదు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లలను ఆకట్టుకునే విధంగా పని చేయాలి

● అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించిన కలెక్టర్

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలను ఆకట్టుకునే విధంగా కార్యకర్తలు పని చేయాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. బాపట్ల విస్తరణా శిక్షణా కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను శనివారం కలెక్టర్ సందర్శించారు. శిక్షణా తరగతులను పరిశీలించారు. విజయనగరం జిల్లా సోధన శిక్షణా బృందం హైదరాబాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు 4 బ్యాచ్‌లుగా రెండు రోజుల శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రాలకు వచ్చే పిల్లలను సొంత బిడ్డలు వలే చూచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, సీడీపీవో లక్ష్మీపార్వతి, సూపర్‌వైజర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కార్యకర్తలతో కలెక్టర్ జె.వెంకటమురళి

లైంగిక, అశ్లీలత నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు

● ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణి




సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అశ్లీలత, లైంగిక వేధింపులు వంటి నేరాల విచారణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయటం జరిగిందని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి తెలిపారు. సూర్యలంకరోడ్డులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఫోక్సో యాక్ట్, లైంగిక వేధింపుల నిరోధక చట్టం మీద అవగాహన సదస్సు నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జడ్జి వాణి ముఖ్యఅతిథిగా పాల్గొని చట్టాలపై అవగాహన కల్పించారు. పిల్లలకు గృహహింస, భరణం, విద్యాహక్కు చట్టం, ర్యాగింగ్ వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. సదస్సులో న్యాయవాదులు భీమాలీలాకృష్ణ, కంచర్ల రవిబాబు, రామాంజనేయులు, బి.నాగమణి, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సేవాదృక్పదం అలవర్చుకోవాలి : ఎంఈవో

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశ నుంచే సేవాదృక్పదం అలవర్చుకోవాలని ఎంఈవో ఎస్.నిరంజన్ తెలిపారు. మండలంలోని చెరువుజమ్ములపాలెం ఎస్ చర్చి మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం జేసీఎస్ఎంఎం సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ సౌజన్యంతో నోట్‌పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్ళు, పలకలు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి.సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంఈవో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఏడాది జాన్‌వెస్లీ ఈవిధంగా విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేయటం అభినందనీయమన్నారు. అనంతరం 50 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ప్రకాశవర్ధిని, జె.శ్యామసుందరి, వి.భారతి, పాస్టర్ బుర్రా మోజెస్, సభ్యులు జయపాల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్నభోజనాన్ని తనిఖీ చేశారు.



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో ఎస్.నిరంజన్, ఉపాధ్యాయులు తదితరులు

హైవెండ్ స్కూల్‌లో రంగుల దినోత్సవం

కర్లపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక హైవెండ్ స్కూల్‌లో శనివారం రంగుల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు, ఉపాధ్యాయులు వివిధ రంగుల ఆకృతులను తయారు చేసి తరగతి గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పెదమల్లు ఉదయచంద్రరావు, డైరెక్టర్‌లు సాయిమహేంద్రబాబు, చాందిని, ఉపాధ్యాయులు పరీదా, రజియా, అనూష, బ్యూలా, జెరీనా, వినిత, షబీనా, ద్వారకా, రమణ తదితరులు పాల్గొన్నారు.



రంగుల ఆకృతులతో చిన్నారులు, ఉపాధ్యాయులు

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

● అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి భూమిని కాపాడాలని డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్‌బేగ్ తెలిపారు. కళాశాలలో శనివారం ఎండింగ్ ప్లాస్టిక్ పొల్యూషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎస్.వినోద్, డాక్టర్ ఇ.గౌతమి, టీచింగ్ అసోసియేట్స్ డాక్టర్ ఎస్.వినోద్‌బాబు, పీడీ డాక్టర్ వై.ఫణీంద్రకుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



జిల్లా పోలీసు కార్యాలయ ఆవరణలో వ్యర్థాలు తొలిగించి శుభ్రం చేస్తున్న పోలీసు సిబ్బంది

● బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పిచ్చిమొక్కలు తొలిగించి చెత్తాచెదారం ఏరివేశారు. అదేవిధంగా పట్టణ, రూరల్ పోలీసుస్టేషన్‌లో కూడా సీఐలు ఆర్.రాంబాబు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరిసరాలు పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో ఏఆర్‌డీఎస్పీ విజయసారథి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎంటీఆర్ఐ శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



రేపల్లె ఎన్టీఆర్ సర్కిల్‌వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ శాఖల అధికారులు, నాయకులు

● రేపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : సమష్టి కృషితో స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దుదామని ఆర్డీవో రామలక్ష్మి అన్నారు. పట్టణంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ సర్కిల్ వద్ద స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాపశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావు, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, సీఐ మల్లికార్జున్‌రావు, ఛైర్‌పర్సన్ కట్టా మంగా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, నాయకులు జీపీ రామారావు, పంతాని సాయికుమార్, దేవగిరి రవి, కొలసాని రాము, వై.కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, కేసన నరసింహ, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

● చెరుకుపల్లి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : చెరుకుపల్లి, గుళ్ళపల్లి ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల వద్ద జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు ప్లాస్టిక్ నిరోధం, తడి, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, ఈవోపీఆర్డీ శ్రీనివాసన్, సాగునీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ ఎం.రాధాకృష్ణమూర్తి, పంచాయతీ ఈవోలు ఈ.విజయబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

● భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛంధ్ర, స్వచ్ఛదివస్ కార్యక్రమాన్ని ఎంపీడీవో వెంకటరమణ, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు నిర్వహించారు. భట్టిప్రోలులో తమ్మన మల్లిఖార్జునరావు ఉన్నత పాఠశాల విద్యార్థులు, అధికారులు ప్లాస్టిక్ వాడకం నిషేధం, పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలని కోరుతూ గ్రామంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా కిరణ్మయి, ఏపీఎం శ్రీమన్నారాయణ, హెచ్ఎం రామకోటేశ్వరరావు, ఆర్ఐ ఫణికుమార్, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● వేమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛభారత్, స్వచ్ఛాంధ్ర సాధనకు సమిష్టి కృషి అవసరమని ఎంపీడీవో పెద్దింటి రవికుమార్ అన్నారు. వేమూరులో స్వచ్ఛభారత్ స్వచ్ఛాంధ్రలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించి ఉద్యోగులు ప్రజల చేత ప్రమాణం చేయించారు. తహసీల్దార్ సుశీల మాట్లాడుతూ, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో శేఖర్, పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మండల పరిధిలోని 17 గ్రామాల్లో గ్రామ సభలతో పాటు ర్యాలీలు నిర్వహించారు.



వేమూరులో స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

● కర్లపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛత వైపు ఒక అడుగు వేద్దామని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ నిషేధంపై శనివారం కర్లపాలెం ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ షాకీర్‌బాషా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం మానవాళికి ముప్పు అని అందరూ స్వచ్ఛాంధ్ర వైపు అడుగులు వేద్దామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సునీత, ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, అయినంపూడి హెచ్ఎం విజయలక్ష్మి, జి.శ్రీనివాసరావు ఉపాధ్యాయులు, ఇనకొల్లు పోలీసురావు పాల్గొన్నారు.

● కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామ సచివాలయం వద్ద స్వచ్ఛాంధ్ర దివస్ కార్యక్రమంలో భాగంగా టీడీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు పాల్గొని ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి షాహిన, గ్రామ పార్టీ అధ్యక్షుడు మునిపల్లి చిన్న, గరిగంటి శ్రీనివాసరావు, బీసాబత్తిన నాగాంజనేయులు, గుర్రాల వెంకటరామారావు, సాయన రాంబాబు పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మంతెనవారిపాలెం గ్రామపంచాయతీ కూడలిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, బాపట్ల డివిజనల్ అధికారిణి సీహెచ్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. సచివాలయ ఉద్యోగులు, విద్యార్థులు, వివిధశాఖల అధికారులతో మానవహారం నిర్వహించిన అనంతరం ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం గురించి దుకాణాదారులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ఎ.ఎలీషాబాబు, తహసీల్దార్ డి.వెంకటేశ్వరరావు, మంతెనవారిపాలెం గ్రామసర్పంచ్ లక్కంరాజు వెంకటపతిరాజు, పంచాయతీ కార్యదర్శి కె.వసుంధరలక్ష్మి, వీఆర్వో నాగజ్యోతి, ఏపీఎం చిన్నయ్య, ఏపీవో గణపతి, ఏవో సత్యానంద్, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.శైలజ, చందోలు ఎస్ఐ ఎం.శివకుమార్ పాల్గొన్నారు. అలాగే పిట్టలవానిపాలెం గ్రామంలోని ఐలెండ్ సెంటర్‌లో గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రసాదరావు, గ్రామసర్పంచ్ బొలగాని అరుణకుమారి, సుబ్బారావులతో కలిసి ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ, మానవహారం నిర్వహించారు.

కార్మికుల సమస్యలపై నిర్లక్ష్యం సరికాదు : మాల్యాద్రి

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆంధ్ర మాల్యాద్రి అన్నారు. బాపట్ల మున్సిపల్ కార్యాలయం దగ్గర కార్మికులు చేస్తున్న సమ్మె శిబిరాన్ని సంఘ నాయకులతో కలిసి శనివారం ఆయన సందర్శించారు. మాల్యాద్రి మాట్లాడుతూ పెరిగిన ధరలను దృష్టిలో పెట్టుకొని కార్మికవేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, కిరణ్, మనోజ్,కార్మిక సంఘం నాయకులు కె.శరత్, రత్నం, నాని, హరిబాబు అంకారావు, ఏసమ్మ, ప్రమీల, స్వామిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణపై దృష్టిసారించాలి : విన్నకోట

బాపట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : అసంపూర్తిగా నిలిచిపోయిన బాపట్ల మున్సిపల్ హైస్కూల్ భవనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌లు ఇచ్చిన హామీ మేరకు రూ.కోటి 48 లక్షలతో సకాలంలో పూర్తి చేయించటం హర్షణీయమని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు విన్నకోట సత్యప్రసాద్ అన్నారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో నిర్మించిన ఇండోర్ స్టేడియంలో విద్యార్థులకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అలాగే విద్యార్థుల క్రమశిక్షణపై కూడా దృష్టిసారించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలన్నారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్‌కు, విద్యాశాఖ కమిషనర్‌కు, కలెక్టర్, డీఈవోలకు లేఖలు పంపించినట్లు తెలిపారు.

బాల్యవివాహ రహిత సమాజమే లక్ష్యం

కర్లపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బాల్యవివాహ రహిత సమాజ లక్ష్య సాధన కోసం కృషి చేయాలని బాపట్ల జిల్లా పరిరక్షణ అధికారి పురుషోత్తమరావు అన్నారు. సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ (సీపార్డ్) బాపట్ల వారి ఆధ్వర్యంలో శనివారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెంలోని సతీష్, అపర్ణ మెరైన్ కంపెనీలలో బాల్యవివాహాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిపార్డ్ సంస్థ ప్రతినిధి బడుగు కిషోర్, సతీష్, మెరైన్ హెచ్‌ఆర్ శ్రీనివాసరావు, ఐసీడీఎస్ అవుట్ రీచ్ వర్కర్ సయ్యద్ అబ్దుల్, కరీం, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం

బాపట్లరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల కాలేజీ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో వారం రోజులపాటు కొనసాగిన హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ దిగ్విజయంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీఈజీకే మూర్తి తెలిపారు. ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల, బాపట్ల ఫార్మసీ కళాశాల సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహించాయని తెలిపారు. వారం రోజుపాటు నైపుణ్యశిక్షణ అందుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌లను అందజేశారు. బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు, సెక్రటరి మానం నాగేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు నిర్వాహకులను అభినందించారు.

ప్రముఖ నటి సరోజదేవికి ఘననివాళి

బాపట్లరూరల్, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఘంటసాల విగ్రహం వద్ద జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రముఖ నటి సరోజదేవికి జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు కోట వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో సుమారు 200లకు పైగా చిత్రాలలో నటించారన్నారు. పద్మభూషణ్, ఎన్టీఆర్ అవార్డు ఆమె పొందటం జరిగిందన్నారు. న్యాయవాదులు తమలపాకుల భాస్కరరావు, చల్లపల్లి రాజు, గుంటూరు సురేష్ పాల్గొన్నారు.

సాగునీటి సమస్యను తీర్చాలి

కొల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల్లో నెలకొన్న తాగు, సాగునీటి సమస్యలు తీర్చాలని సర్వసభ్య సమావేశంలో సభ్యులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. శనివారం కొల్లూరు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణానదిలో విచ్చలవిడి ఇసుక తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోయి తాగు, సాగునీటి సమస్యలు తలెత్తాయని ఆయా సమస్యలు తీర్చడానికి నూతన బొరెల్ బోర్లను ఏర్పాటు చేయాలని ఓ సభ్యుడు ఈ అంశాన్ని సమావేశంలో లేవనెత్తగా మిగిలిన సభ్యులు కూడా బలపరిచారు. ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో జరిగే అధికారిక ప్రభుత్వ కార్యక్రమాల గురించి ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను సమావేశంలో వెల్లడించారు. జడ్పీటీసీ చొప్పర సుబ్బారావు, మండల ఉపాధ్యక్షులు మురాల రాంబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పంచాయితీ కార్యదర్శులు, ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల భద్రతకు ప్రాధాన్యం : ఎస్ఐ

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మహిళ భద్రత ప్రాధాన్యత, శక్తి యాప్ గురించి విద్యార్థులకు రేపల్లె సబ్ డివిజన్ శక్తి యాప్ టీమ్ ఇన్‌చార్జి, నగరం ఎస్ఐ భార్గవ్ అవగాహన కల్పించారు. స్థానిక విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్ఐ పాల్గొని పాఠశాలలోని బాలికలకు శక్తి యాప్ ప్రాముఖ్యత, దానిని ఉపయోగించే విధానంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నప్పుడు భయపడకుండా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కరస్పాండెంట్ వెంకట్రావు, ప్రిన్సిపల్ ఫణిపార్థసారథి, పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఇంట్లోనే మృతి చెందిన వ్యక్తి

● దుర్గంధం వెదజల్లడంతో స్థానికులు డయల్ 100కు సమాచారం

కొల్లూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు దక్షిణపు వీధిలోని ఓ ఇంటిలో కోన శ్రీనివాసరావు ఒంటరిగా అద్దెకు ఉంటున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అనారోగ్యంతో ఐదు రోజుల క్రితం అద్దెకు ఉంటున్న ఇంటిలోనే మృతి చెందాడు. శనివారం ఆ ఇంటి నుంచి భరించలేని దుర్వాసన రావడంతో చుట్టుపక్కల వారు 100కు ఫోన్ చేసి సమాచారం అందించడంతో ఎస్ఐ అమరవర్ధన్, రెవెన్యూ, పంచాయతీ అధికారులకు విషయం వివరించి వారి సమక్షంలో ఇంటి తలుపులు తెరిచి చూడగా వ్యక్తి మృతి చెంది ఉండటం గుర్తించారు. మృతుని బంధువులు కొల్లూరులోనే ఉంటున్నట్లు తెలుసుకుని మృతదేహాన్ని రెవెన్యూ, పంచాయతీ అధికారుల సమక్షంలో వారికి అప్పగించారు.

వైసీపీ రాష్ట్ర కార్యదర్శిగా మోదుగుల

బాపట్ల,జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ రాష్ట్రకార్యదర్శుల నియామకంలో బాపట్ల పార్లమెంట్ నుంచి ముగ్గుర్ని నియమించారు. సీనియర్ నాయకుడు మోదుగుల బసవపున్నారెడ్డి, కెవి.ప్రసాద్, చేజర్ల నారాయణరెడ్డిలను నియమించారు. కేంద్ర పార్టీ కార్యాలయంతో సమన్వయం చేసుకుంటూ రీజనల్ కోఆర్డినేటర్లు, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులకు సహాయకారిగా వీరు వ్యవహరించనున్నారు.

శ్రీగుడారంకమ్మతల్లికి సారె సమర్పించిన భక్తులు

కర్లపాలెం, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతనందాయపాలెం గ్రామంలో ఉన్న చీరాలవారి ఇలవేల్పు శ్రీగుడారంకమ్మతల్లికి శనివారం సారె సమర్పించారు. ఏట్రవారిపాలెం గ్రామసర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి భక్తులతో కలిసి అక్కడ నిర్వహించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం సారె సమర్పించారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అభివృద్ధి తెలియజేసేందుకే 'సుపరిపాలనలో తొలిఅడుగు'

● ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమృతలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : చేసిన అభివృద్ధి చెప్పడంతోపాటు, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని కోరుతాడిపర్రు, వామనగుంటపాలెం గ్రామాల్లో శనివారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరుగుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అందించిన పథకాలు, ప్రభుత్వ పాలన ఎలా ఉంది అనే విషయాలను ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఇంటిలో లబ్ధిదారులకు ఏఏ పథకాలు అందాయో వివరాలను పరిశీలించారు. చేసిన అభివృద్ధిపై కరపత్రాలను పంపిణీ చేశారు. గోపాయిపాలెంలో అసంపూర్తిగా ఉన్న తాగునీటి పథకంపై గ్రామస్థులు ఎమ్మెల్యేకు విన్నవించారు. స్పందించిన ఎమ్మెల్యే పథకం పూర్తికి రూ.35 లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, నియోజకవర్గ పరిశీలకులు వంగా సాంబిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు క్రొత్తపల్లి రవీంద్రబాబు, పెదపూడి పీఏసీఎస్ ఛైర్మన్ కొసరాజు దేవకుమార్, ఆరమండ్ల లక్ష్మీనారాయణ, జూలాది విజయ్‌చందు, చిలకపాటి మధు, సుంకర రామకృష్ణ పాల్గొన్నారు.

రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధికి శ్రీకారం

● మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్



డ్రెయినేజీ, సీసీ రహదారులకు శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

రేపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో రహదారులు, డ్రెయినేజీలు అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రహదారులు, నూతన డ్రెయిన్‌లకు శనివారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ మంత్రి అనగాని సత్యప్రసాద్ రహదారులు, డ్రెయిన్‌ల అభివృద్ధి కోసం రూ.90 లక్షల నిధులు మంజూరు చేయించారని వాటితో పనులు చేయిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి జరుగుతుందని, గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో కనీసం పట్టణం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మేకా రామకృష్ణ, టీడీపీ నాయకులు గోగినేని పట్టాభిరామారావు, దేవగిరి రంగా, జనసేన పార్టీ నాయకులు డి.శంకర్ పాల్గొన్నారు.

పట్టణంలో ఆక్రమణలు తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

రేపల్లె, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో దుకాణాల ముందు ఆక్రమణకు గురైన వాటిని తొలగిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు తెలిపారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద షాపుల ముందు డ్రెయిన్‌లు ఆక్రమించుకున్న వాటిని ఎక్స్‌కవేటర్‌తో శనివారం తొలగించారు. ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీలు, పురపాలక స్థలాలను ఆక్రమించుకోవటంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులకు గురౌవుతున్నారని, ఉన్నతాధికారుల దృష్టి మేరకు పట్టణంలో ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టామని, ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

బీఎల్‌వోలు బాధ్యతగా వ్యవహరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.నాగిరెడ్డి

వేమూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల స్థాయిలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపుల కార్యక్రమంపై బీఎల్‌వోలు అవగాహనతో పాటు బాధ్యతగా పని చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.నాగిరెడ్డి అన్నారు. శనివారం స్థానిక రోశయ్య మీటింగ్ హాలులో తహసీల్దార్ అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సు నిర్వహించారు. బీఎల్‌వోలు ఎంతో గౌరవ ప్రదమైన సేవా దృక్పదంతో పని చేయడంతో పాటు ఓటర్లకు అందుబాటులో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో చుండూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమృతలూరు తహసీల్దార్లు నాగరాజారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, నెహ్రూబాబు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త పోలింగ్ కేంద్రాలకు అఖిలపక్ష సమావేశంలో తీర్మానం

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామాల స్థాయి ఓటరు జాబితాలను పరిశీలించారు. కొల్లూరు మండలంలోని దోనేపూడి గ్రామంలో ఒకటి, కొల్లూరు గ్రామంలో రెండు, జువ్వలపాలెంలో ఒక పోలింగ్ కేంద్రాన్ని అదనంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. దీనిపై ఐదు మండలాల స్థాయి తహసీల్దార్లు అఖిల పక్ష సమావేశానికి విచ్చేసిన వివిధ పార్టీల ప్రతినిధులతో చర్చించారు. గుర్తించిన నాలుగు ప్రాంతాల్లో నిబంధనల మేరకు 1200 ఓటర్లు దాటి ఉండటం వల్ల అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. సంబంధిత తీర్మానాన్ని జిల్లా ఎన్నికల అధికారిగా వ్యవహరించే కలెక్టర్‌కు పంపుతున్నట్లు నాగిరెడ్డి పేర్కొన్నారు. సమావేశంలో పోలింగ్ కేంద్రాల వద్ద సౌకర్యాల పరిస్థితిపై చర్చించారు.

ప్రతీ రైతు పంట వివరాలు నమోదు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బాపట్ల ఏడీఏ ధనరాజ్

అమృతలూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు వేసిన పంట వివరాలు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బాపట్ల ఏడీఏ ధనరాజ్ అన్నారు. అమృతలూరులోని రైతు సేవా కేంద్రంలో సాధారణ బదిలీల్లో భాగంగా నూతనంగా వచ్చిన మండల వ్యవసాయశాఖ అధికారి, ఏఈవోలు, వీఏఏలు, విత్తనాలు, పురుగుమందుల డీలర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ రైతులు వేసిన పంట ఆన్‌లైన్ నమోదు విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. నిర్లక్ష్యంపోతే సహించేది లేదని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్‌యోజన బీమా పథకంలో నష్టపోయిన రైతుకు రూ.40 వేల వరకు బీమా వస్తుందని, దీనిపై రైతులకు అవగాహన కల్పించి వారితో ఎకరాకు రూ.800 ప్రీమియం చెల్లించేలా చూడాలన్నారు. అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే సహించేది లేదని, నాణ్యమైన వాటినే విక్రయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారి హేమంత్ భరత్‌కుమార్, ఏఈవోలు మణికంఠ, మాధవి, మండల పరిధిలోని వీఏఏలు తదితరులు పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

నేషనల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థి ప్రతిభ


ఖాజావలిని సత్కరిస్తున్న కళాశాల ప్రతినిధులు

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ విద్యార్థి షేక్ ఖాజావలి ప్రతిభ చాటారు. కర్ణాటక రాష్ట్రంలో దేవనగర్‌లో జరిగిన పోటీల్లో కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి జూనియర్ మెన్ బెస్ట్ లిఫ్టర్ ఇన్ ఇండియా సెకండ్ రన్నరప్‌గా నిలిచారు. దీంతో శనివారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, ప్రిన్సిపల్ డా.జగదీష్ ప్రత్యేకంగా అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

వేటపాలెం (చీరాల), జూలై 19 (ఆంధ్రజ్యోతి) : పరిసరాల పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని ఆమోదగిరిపట్నం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శేఖరరావు అన్నారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ చేశారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ వెంకటేశ్వర్లు సుధాకర్, రత్నం, రాజ్యలక్ష్మీ, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై మార్టూరులో ర్యాలీ

మార్టూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని అన్ని గ్రామాలలో ప్లాస్టిక్ నిషేధించాలని కోరుతూ స్కూలు విద్యార్థులు, అంగన్‌వాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. మార్టూరులో రాయల్ స్కూల్ బజారులో జడ్పీ హైస్కూల్ విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీవో వై.శ్రీనివాసరావు, పంచాయతీ ఈవో తస్నీరు శ్రీనివాసరావులు పాల్గొన్నారు. అదేవిధంగా మార్టూరులో గన్నవరంరోడ్డు, పెద్ద అండరుపాస్ వద్ద, ఫ్లైవోవరు ప్రక్కన రోడ్లుపై బ్లీచింగ్ ను చల్లించారు. వలపర్ల గ్రామంలోని ప్రధాన సెంటరు లో ఎస్‌సీసీ విద్యార్థులు, అంగనవాడీ కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. అంతేగాకుండా సర్పంచ్ తాళ్లూరి బ్రహ్మయ్య, పంచాయతీ కార్యదర్శి హరిబాబుల ఆధ్వర్యంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. నాగరాజుపల్లిలో సర్పంచ్ దాసరి నరేంద్రబాబు, పంచాయతీ కార్యదర్శి మురళీకృష్ణల ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.

ప్లాస్టిక్ రహిత సమాజంలో అందరూ భాగస్వాములు కావాలి

చినగంజాం, జూలై 19(ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎస్.విజయలు అన్నారు. చినగంజాంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై శనివారం అధికారులు, గ్రామ పంచాయతి సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కూడలిలో ర్యాలీ అనంతరం అధికారులు, విద్యార్థులు మానవహారం నిర్వహించి, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ప్లాస్టిక్ నిషేదంపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చినగంజాం సర్పంచ్ రాయని ఆత్మారావు ఉపసర్పంచ్ చెరుకూరి రాఘవయ్య, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు రాజశేఖర్, బసవరాణి, ఏపీఎం జి.సుబ్బారావు, ఏపీవో జె.లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి అంజయ్య, గ్రామ పంచాయతీ సిబ్బంది, చినగంజాం జడ్పీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

అద్దంకిటౌన్, జూలై 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత పర్యావరణహిత సమాజమే లక్ష్యంగా మన మందరం ముందుకు సాగాలని అద్దంకి మున్సిపల్ కమిషనర్ ఏ.రవీంద్ర అన్నారు. శనివారం స్థానిక కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్లాస్టిక్ వ్యర్థాలతో హానికర చర్యలు, ప్రజారోగ్యంపై వాటి దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రవీంద్ర హాజరై మాట్లాడారు. కళాశాల వృక్షశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ మస్తాన్‌వలి ప్లాస్టిక్ వ్యర్థ యాజమాన్యం, వ్యక్తిగత పాత్రలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఏఎస్‌ఏ కన్వీనర్ డాక్టర్ వి.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీవో డి.రాజశేఖర్, ఎన్.షర్మిలారాణి, ఎన్ఎస్ఎస్ కన్వీనర్ సీహెచ్.ప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : ప్లాస్టిక్ వినియోగంపై ప్రజలకు అవగాహన పెంచాలని జడ్పీ డిప్యూటీ సీఈవో బాలమ్మ అన్నారు. పంగులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఎంపీడీవో స్వరూపారాణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో బాలమ్మ మాట్లాడుతూ వినియోగించదగిన, వినియోగించకూడని ప్లాస్టిక్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి అనంతరాజు, జడ్పీటీసీ సభ్యురాలు రాయని ప్రమీల, తహసీల్దార్ సింగారావు తదతరులు పాల్గొన్నారు.

పరసరాల పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత

పర్చూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ఎస్సై జీవీ.చౌదరి అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ప్రాంగణంలోని చిల్లచెట్లను తొలగించటంతోపాటు, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ భారత్


పోలీస్ స్టేషన్‌లో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న సీఐ సుబ్బరాజు

అద్దంకి : స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఉన్న పిచ్చిమొక్కలను సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో తొలగించారు. అద్దంకి కొండ వద్ద డంపింగ్ యార్డు తొలగించిన ప్రాంతంలో అద్దంకి మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర శానిటరీ ఇన్‌స్పెక్టర్ బలరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోళ్లను వేగవంతం చేసేలా చర్యలు

- కలెక్టర్ వెంకటమురళి
- పర్చూరులో ఏఎంసీ గోడౌన్ల పరిశీలన


కొనుగోలు ప్రక్రియను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ వెంకటమురళి

పర్చూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా కలెక్టర్ జే.వెంకటమురళి అన్నారు. శనివారం పర్చూరు ఏఎంసీ, మార్క్‌ఫెడ్ గోడౌన్‌లలో నిర్వహిస్తున్న బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. సంబంధిత రైతులతోపాటు, స్థానికంగా కొనుగోలు చేస్తున్న బయ్యర్‌తో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లు చేసుకునే విధంగా తమ పేర్లను నమోదు చేసుకున్నా దానికి సంబంధించిన మెసేజ్‌లు రావడం లేదని రైతులు సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. కొనుగోలుకు రెండు వారాల ముందే రైతులకు మేసేజ్ అందించే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వారికి హామీ ఇచ్చారు. మేసేజ్ వచ్చిన వెంటనే రైతులు పొగాకును సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రస్తుతం జిల్లాలో గోదాముల సమస్య ఉందని, దీన్ని అధిగమించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గోదాముల పరిమితికి మించి పొగాకు రావడంతో వాటిని గుంటూరు, ప్రకాశం జిల్లాలకు తరలిస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 13వేల మంది పొగాకు రైతులు ఉండగా వారిలో వెయ్యి మంది రైతుల వద్ద ఉన్న పొగాకు కొనుగోలు చేశామన్నారు. కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి ఇకపై శనివారం రోజున కూడా కొనుగోలు చేస్తామన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పారదర్శకంగా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాపట్ల ఆర్డీవో గ్లోరియా, తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, మార్కెట్ యార్డ్ ఇన్‌చార్జ్ కార్యదర్శి ఓటీఎస్ ప్రసాద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మల్లికార్జునస్వామి ఆలయ పునర్నిర్మాణానికి నిధులు

సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలు మంజూరు

అద్దంకి, జూలై19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో మల్లికార్జునస్వామి దేవాలయం పునఃనిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ నిధులు రూ.50 లక్షలు మంజూరైనట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. దేవాలయం పునఃనిర్మాణానికి రూ.75 లక్షల అంచనా కాగా, రూ.25 లక్షలు గ్రామస్థులు సమకూర్చగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీజీఎఫ్ గ్రాంట్‌గా రూ.50 లక్షలను మంజూరు చేస్తూ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు.

ధూపదీప నైవేద్యాల కింద 10 దేవాలయాలు ఎంపిక

ధూపదీప నైవేద్యాల కింద అద్దంకి నియోజకవర్గంలో 10 దేవాలయాలు ఎంపికైనట్లు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి మండలం చెరువు కొమ్ముపాలెం అంకమ్మవారి దేవాలయం, కోదండరామస్వామి దేవాలయం, ఉప్పలపాడులోని ఆంజనేయస్వామి దేవాలయం, పంగులూరు మండలం కోటపాడు లోని మద్విరాట్ పోతులూరి వీర బ్రహ్మేం ద్రస్వామి దేవాలయం, అభయాంజనేయస్వామి దేవాలయం, కోదండరామస్వామి దేవాలయం, తూర్పుకొప్పెరపాడు లోని విఘ్నేశ్వరస్వామి దేవాలయం, పోలేరమ్మ అమ్మవారిదేవాలయం, నూజెళ్ళపల్లి లోని పోలేరమ్మ అమ్మ వారి దేవాలయం, కొరిశపాడు మండలం దైవాలరావూరు లోని పోలేరమ్మ దేవాలయంలు ఎంపికైనట్లు రవికుమార్ తెలిపారు.

పొగాకును అమ్ముకునే రైతులకు అవగాహన


మేదరమెట్లలో గోడౌన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

మేదరమెట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మవరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన బర్లీ పొగాకు కేంద్రాన్ని కొరిశపాడు తహసీల్దార్ జీవీ సుబ్బారెడ్డి పరిశీలించారు. శనివారం తమ్మవరంలోని కొనుగోలు కేంద్రానికి వెళ్లిన తహసీల్దార్ రైతులతో మాట్లాడారు. దేశంలోనే మొదటిసారిగా నల్ల బర్లీ పొగాకు కొనుగోలును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. మండలంలోని రైతులకు అనుకూలంగా ఉండడానికి ఈ నెల 8వ తేదిన రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారన్నారు. జిల్లా కలెక్టర్ వెంకట మురళి ఆదేశాల మేరకు నల్లబర్లీ పొగాకు చివరి ఆకు వరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పొగాకు పండించిన రైతులు నిర్దేశించిన తేదీలల్లో కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బర్లీ రైతులు పాల్గొన్నారు.

యద్దనపూడి,(మార్టూరు)జూలై19(ఆంధ్రజ్యోతి): నల్లబర్లీ పొగాకును అమ్ము కోవడానికి కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లే రైతులు పాటించవలసిన నిబంధనలను ఏవో కుమారి రైతులకు వివరించారు. శనివారం ఆమె యద్దనపూడి మండలంలో వివిధ గ్రామాలలో పొగాకు రైతులను కలిశారు. జాగర్లమూడి గ్రామంలో రైతుల వద్ద ఉన్న పొగాకు చెక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె రైతులతో మాట్లాడారు. యద్దనపూడి మండల రైతులకు అడుసుమల్లిలో పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. అక్కడకు రైతులకు కేటాయించిన షెడ్యూల్‌లో మాత్రమే పొగాకు చెక్కులను తీసుకువెళ్లాలన్నారు. అదేవిధంగా పొగాకును గ్రేడింగ్ చేసే సమయంలో అన్యపదార్థాలు లేకుండా చూడాలన్నారు.పచ్చ నల్ల ఆకులను తీసివేసి చెక్కులుగా కట్టుకోవాలన్నారు. ముఖ్యంగా తేమశాతం 20 శాతం కంటే తక్కువగా ఉండాలన్నారు. చెక్కు సైజు 25 కిలోలు కంటె ఎక్కువ,150 కిలోలు కంటె తక్కువగా ఉండాలన్నారు. రైతులందరి దగ్గర పొగాకును కొనుగోలు చేస్తారన్నారు. ఎవరూ అధైర్యపడవద్దన్నారు.

పంగులూరు కొనుగోలు కేంద్రం మార్పు

పంగులూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): పంగులూరు మార్కెట్‌యార్డ్‌లో ఇప్పటి వరకు కొనుగోలు చేసిన పొగాకు బేళ్లతో గోడౌన్లు నిండడంతో సోమవారం నుంచి మరో ప్రాంతంలో కొనుగోళ్లు కొనసాగించే విధంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం గోడౌన్ సౌకర్యం ఉన్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్నారు. గత నెల 30న ప్రారంభమైన పంగులూరు కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 155 మంది రైతుల నుండి 2,528 బేళ్ల 2,095 క్వింటాళ్లను కొనుగోలు చేసినట్లు పీఏసీఎస్ సీఈవో నాగబోయిన లక్ష్మీదేవి తెలిపారు. 21వ తేదీ నుంచి ఈ నెల 31 వరకు సన్న చిన్నకారు రైతులకు తమ పొగాకు అమ్మకాలకు మార్క్‌ఫెడ్ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ ద్వారా వర్తమానాలు అందినట్లు సమాచారం. సోమవారం మండలానికి చెందిన 30 మంది రైతులు ఒక్కొక్క రైతు పది చెక్కుల వరకు కొనుగోలు కేంద్రాలలో అమ్ముకునే విదంగా సమాచారమిచ్చారు. రైతులు తమ పొగాకు బేళ్లను ఏ కేంద్రంలో అమ్ముకోవాలనే సమాచారం సంబందిత రైతులకు నిర్దీత వ్యవధిలో తెలియపరచనున్నట్లు సీఈవో లక్ష్మీదేవి తెలిపారు.

చేనేతలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కొండయ్య


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న చేనేత కార్మికులు

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని చేనేతలకు అన్ని విధాలుగా అండగా ఉంటానని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు. ఇటీవల చీరాల సిల్క్ కుప్పడం చీరకు జాతీయ స్థాయి గుర్తింపు రావడంతో శనివారం ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో వ్యవసాయం తరువాత చేనేత రంగానికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. అయితే అనుకోని సమస్యల కారణంగా సంక్షోభంలో ఉన్నట్లు వివరించారు. కూటమి ప్రభుత్వంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చిపెట్టామని, అన్ని రకాల సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు, మాస్టర్ వీవర్ సిద్ది బుచ్చేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వార్డులో పారిశుధ్య పనులు చేపట్టాలి

- మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు


వీధులను పరిశీలిస్తున్న చైర్మన్

చీరాల, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : వార్డుల్లో శానిటేషన్ నిర్వహణ విధిగా నిర్వహించాలని మున్సిపల్ చైర్మన్ మించాల సాంబశివరావు పేర్కొన్నారు. శనివారం పురపాలక సంఘం పరిధిలోని 10వ వార్డులో చైర్మన్ సాంబశివరావు పర్యటించారు. ఈసందర్భంగా డ్రెయిన్లు శానిటేషన్ నిర్వహణ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు, ప్రజల ఆరోగ్యంపై కచ్చితంగా జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రెయిన్లలో ఆయిల్ బాల్స్, బ్లీచింగ్ వంటివి చల్లాలని సూచించారు. చైర్మన్ వెంట శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

అద్దంకి, జూలై19 (ఆంధ్రజ్యోతి) : రైతుబంధు పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని రూ.2 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు పొందవచ్చని ఏఎంసీ ఛైర్‌పర్సన్ పద్మావతి అన్నారు. అద్దంకి ఏఎంసీ పాలకవర్గం తొలి సమావేశం శనివారం స్థానిక మార్కెట్ యార్డు కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించారు. కార్యాలయం భవనం శిధిలావస్థకు చేరినందున కొత్త భవనం మంజూరు చేయాలని, రైతు బజారుకు స్థలం కేటాయించాలని తీర్మానాలు చేశారు. వైస్‌ఛైర్మన్ ధర్మవరపు నాగేశ్వరరావు, ప్రత్యేకశ్రేణి కార్యదర్శి సూర్య ప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

అద్దంకి, జూలై 19 (ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందా డు. పోలీసుల కథనం మేరకు మండలంలోని శింగరకొండపాలేనికి చెందిన ఎర్రిబోయిన వెంకట మణికంఠ(24) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ గా ఉద్యోగం చేస్తున్నాడు. ఈ నెల 9న హైదరాబాద్ నుండి శింగరకొండపాలెం వచ్చాడు. మౌనంగా ఉంటుండడంతో అనుమానంతో సీతయ్య ప్రశ్నించాడు. చనిపోవాలని అనిపిస్తుందని తండ్రితో తెలిపి ముబావంగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో 14వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో గడ్డి మందు తాగాడు. వాంతి చేసుకోవడాన్ని గమనించిన తండ్రి వెంటనే అద్దంకి లోని ప్రవేట్ వైద్యశాలకు తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం మంగళగిరిలోని ఎన్‌ఆర్‌ఐ వైద్యశాలకు తరలించాడు. చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

- బాధితురాలికి గాయాలు


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్సైలు

మేదరమెట్ల, జూలై 19 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలో కొరిశపాడు ఫ్లైఓవర్ పక్కన ఉన్న సర్వీస్ రోడ్డులో హోటల్ నడుపుతున్న మహిళ మెడలో గొలుసును ఇద్దరు వ్యక్తులు లాక్కెళ్ళారు. ఈ క్రమంలో కింద పడిన మహిళకు గాయాలయ్యాయి. శనివారం కొరిశపాడుకు చెందిన గాలి సత్యవతి వద్దకు ఉదయం 6.30 గంటల సమయంలో టిఫిన్ కావాలని అడిగారు. టిఫిన్ ఇస్తుండగా, ఆమె మెడలోని 20 గ్రాముల బంగారు గొలుసును దొంగలు లాక్కెళ్లారు. దొంగలు గొలుసు లాగుతున్నప్పుడు ఆమె కింద పడడంతో తలకు రాయితగిలి తీవ్ర గాయమైంది. గోలుసు లాక్కున్న దొంగలు మోటర్ సైకిల్‌పై చిలకలూరిపేట వైపు వెళ్లారు. కొరిశపాడు పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగమని పెళ్లి

- అదనపు కట్నం కావాలని వేధింపులు

అద్దంకి, జూలై19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్‌కు చెందిన కామినేని శ్రావణిని నర్సరావుపేట సమీపంలోని దోనెపూడి కి చెందిన కందుల నాగదేవతో ఏడాది క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం ఉందని చెప్పి, కట్నంగా ఎకరా పొలం, 10 సవర్ల బంగారం తీసుకున్నారు. ఎలాంటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం లేకపోగా, కట్నంగా ఇచ్చిన ఎకరా పొలాన్ని అమ్ముకొని రమ్మని భర్త నాగదేవతో పాటు కుటుంబసభ్యులు వేధింపులకు పాల్పడ్డారు. ఆ మేరకు బాధిత యువతి శ్రావణి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు భర్త నాగదేవతో పాటు కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సౌమ్య


మాట్లాడుతున్న డాక్టర్ సౌమ్య

పర్చూరు, జూలై 19 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు పర్చూరు ప్రభుత్వ వైద్యశాల (సీహెచ్‌సీ) సూపరింటెండెంట్ జె.సౌమ్య పేర్కొన్నారు. స్థానిక వైద్యశాల బాధ్యతలు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వైద్యశాలలోని వసతులు వైద్యసేవల గురించి వివరించారు. గతంలో కొద్దిపాటి శస్త్రచికిత్సలకే పరిమితమైన వైద్యశాలలో నేడు క్లిష్టతమైన ఆపరేషన్‌లను కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్పొరేట్ వైద్యశాలలకు ధీటుగా నేడు ప్రభుత్వం అన్ని వసతులను ప్రభుత్వ వైద్యశాలల్లో కల్పిస్తుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆలీ, డాక్టర్ సింధు, సత్యదీప్తి, చంద్రకళ, స్థానిక వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత గుండె చికిత్స వైద్య శిబిరం

మార్టూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం మార్టూరులో గుంటూరు వారి అపార్ట్‌మెంట్ ఆవరణలో హెల్ప్ వైద్యశాల విజయవాడ వారి ఆధ్వర్యంలో ఉచిత గుండెచికిత్స వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు మాదాల సాంబశివరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో డాక్టర్ కార్తీక్ నాయుడు, డాక్టర్ నాగకిరణ్‌లు రోగులకు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అవసరమైన వారు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలన్నారు.

జొన్నతాళిలో వైద్యసిబ్బంది పరీక్షలు

మార్టూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): సమగ్ర ఆరోగ్య ప్రచార కార్యక్రమంలో భాగంగా మండలంలోని జొన్నతాళి గ్రామంలో శనివారం 104 వైద్యబృందం ప్రజలకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలోని 35 మందికి హెచ్‌ఐవీ, సిఫిలిస్, హైపటైటిస్‌బి, సి పరీక్షలు నిర్వహించారు. అంతేగాకుండా వారికి ఈ వ్యాధులపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో డాక్టరు పద్మజ, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పీ రాజేష్, ఏఎన్‌ఎం శివకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలను పెంచాలి

మార్టూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): రానున్న రోజులలో ప్రభుత్వం ఉపాధ్యాయులకు గ్రేడింగ్ పాయింట్లు ఇవ్వనున్నారని, పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యాప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలని ఎంఈవో వస్త్రంనాయక్ అన్నారు. శనివారం మండలంలో నాలుగు పాఠశాలలో సముదాయాల సమావేశాలు నిర్వహించారు. వాటిలో మార్టూరు, ద్రోణాదుల, కోలలపూడి గ్రామాలలో జరిగిన పాఠశాలల సముదాయాల సమావేశానికి ఎంఈవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అదేవిదంగా వలపర్లలో నిర్వహించిన సమావేశానికి రెండవ ఎంఈవో కే.ప్రేమలత హాజరయ్యారు. కార్యక్రమాలలో సీఆర్పీలు రమేష్, రామారావు, శ్రీనివాసరావు, తిరుపతమ్మలు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ఉండేది టీడీపీ ప్రభుత్వమే

మార్టూరు, జూలై19 (ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణకు, వారికి అన్నివిధాలుగా అండగా ఉండేది టీడీపీ ప్రభుత్వమేనని ఆ పార్టీ నాయకుడు కమ్మ శివనాగేశ్వరరావు అన్నారు. సుపరిపాలన,తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి మార్టూరు గ్రామంలో నేతాజీనగర్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్టూరు పట్టణంలో ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా ఎమ్మెల్యే ఏలూరి సాంబ శివరావు కృషి చేస్తున్నారన్నారు. అదేవిదంగా తల్లికి వందనం పథకంలో ప్రతి ఇంట బడికివెళ్లే బాల బాలికలకు వారి తల్లులు ఖాతాలో డబ్బులు పడేవిధంగా ముఖ్య మంత్రి చంద్రబాబు చేసిన కృషిని వి వరించారు. కార్యక్రమంలో మందపాటి అంజయ్య, ముక్తిపాటి సాయిబాబా, రాంబాబు, గొట్టిపాటి వెంకట్రావు, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, నాగండ్ల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లిపాయల ఆటో బోల్తా

- వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టడంతో ఘటన


పడిపోయిన ట్రాలీ ఆటో

మార్టూరు, జూలై19(ఆంధ్రజ్యోతి): జాతీయరహదారిపై ఒంగోలు వైపు మండల పరిధిలోని ఇసుకదర్శి ఫ్లైఓవర్ పై ఉల్లిపాయల లోడుతో వెళుతున్న టాటా ఏస్ ఆటోను వెనుక నుండి లారీ ఢీకొట్టింది. ఈ ఘటన శనివారం వేకువజామున చోటుచేసుకొంది. పోలీసులు కథనం ప్రకారం విజయవాడ నుంచి కలిగిరికి ఉల్లిపాయలను తీసుకువెళుతున్న వాహనాన్ని, జార్ఖండ్ నుంచి నెల్లూరుకు వెళుతున్న లారీ ఢీకొంది. లారీ డ్రైవరు నిద్రమత్తులో ఉండడంతో ప్రమాదం చోటుచేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ట్రాలీ ఆటో డ్రైవరు మహేష్ గాయపడగా, హైవే అంబులెన్స్ లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమయిన లారీ డ్రైవరు మొల్లి కన్నయ్యకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

పంగులూరు, జూలై 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కశ్యాపురం గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన పేద వృద్ధ మహిళ మేరుమూరి గోవిందమ్మ మట్టిఖర్చులకు విశ్వబ్రాహ్మణ సంఘ ప్రతినిధులు ఆర్థికసాయం అందజేశారు. జిల్లా సంఘం, దాతల సహకారంతో మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు మచ్చా వెంకటేశ్వర్లు సారధ్యంలో శనివారం గోవిందమ్మ కుమార్తె కోటపాటి లక్ష్మికి రూ.10వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి మునగంటి నరసింహాచారి, టి.రామకృష్ణ, తక్కెళ్లపాటి నాగేంద్రప్రసాద్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో వసతులపై అవగాహన

సంతమాగులూరు జూలై 19 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్ని వసతులు ప్రభుత్వం కల్పిస్తోందని సంతమాగుళూరు ప్రాజెక్టు సీడీపీవో డి సుధా అన్నారు. కొప్పరం పంచాయతీ పరిధిలోని నెహ్రూనగరం ఎస్టీ కాలనీ అంగన్వాడి కేంద్రంలో అవగాహన కల్పించారు, ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అంగన్వాడీలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం, వినూత్నమైన రీతిలో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా పోషక విలువలతో కూడిన ఆహారము, రోజువారి కోడిగుడ్లు, ఆకుకూరలతో కూడిన భోజనము అందిస్తున్నట్లు తెలిపారు. బాలికలకు యుక్తవయసు రాకుండా వివాహం చేయడం నేరమని, అలాంటి పరిస్థితులు మీ ప్రాంతాల్లో జరిగితే సమాచారం ఇవ్వాలని కోరారు, అనంతరం సూపర్వైజర్ సుష్మారాణి, మహిళా పోలీస్ వనజ,కార్యకర్త తిరుమల తదితరులు ర్యాలీ నిర్వహించారు.

పీ-4 సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు

సంతమాగులూరు జులై 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన పి-4 సర్వేతో పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఎంపీడీవో జ్యోతిర్మయి తెలిపారు. శనివారం మండలంలోని అడవిపాలెం, పాత మాగులూరు, గ్రామ సచివాలయంలో పీ-4 సర్వేపై గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నేతలతో గ్రామ సభ నిర్వహించారు . ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పేదలను బంగారు కుటుంబాలుగా గుర్తించి వారికి మెరుగైన జీవనోపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యం అన్నారు. అందుకు దాతృత్వంతో ముందుకు వచ్చే మార్గదర్శులు(ఆర్థికంగా స్థిరపడినవారు) ఎంపికకు అందరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలోని ముగ్గురు గ్రిన్ అంబాసిడర్లకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి దిండు హనుమంతరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్ నాయక్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4పై సర్వే నిర్వహించాలి

అద్దంకిటౌన్ : పీ-4 సర్వేకు సంబంధించి బంగారు కుటుంబాల అవసరాలను గురించి ఈ నెల 21 నుంచి గ్రామాలల్లో సచివాలయ సిబ్బంది సర్వే ప్రారంభించాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య తెలిపారు. శనివారం తన కార్యాలయంలో గ్రామ సచివాలయాల సిబ్బందికి శిక్షణ, అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించారు. బంగారు కుటుంబాల అవసరాల అధారిత సర్వేపై అందరు అవగాహన కలిగి ఉండి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.